





జలగలింగుపురంలో కల్లంలో ఆరబెట్టిన ధాన్యం

వానొస్తే ఎలా?

- ధాన్యం ఆరబెట్టేందుకు అవస్థలు
- టార్పన్లు లేక ఇబ్బందులు
- అన్నదాతలపై అదనపు భారం

మెళియాపుట్టి మండలం దీనబంధుపురం పంచాయతీ కుడ్డబ గ్రామానికి చెందిన లుగలాపు భాస్కరరావు అనే రైతు ఈ ఏడాది ఖరీఫ్‌లో ఐదు ఎకరాల్లో వరి పండించాడు. ఇటీవల నూర్పుడు మిషన్‌తో కోత చేపట్టి.. ధాన్యాన్ని కల్లాలకు చేర్చాడు. ధాన్యం 17 శాతం తేమ వచ్చేవరకూ ఆరబెట్టాలని వ్యవసాయాధికారులు చెప్పారు. దీంతో ఆరబెట్టేందుకు టార్పన్లు లేక.. మార్కెట్‌లో రూ.3వేలు వెచ్చించి కొనుగోలు చేశాడు. మరోవైపు తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో ధాన్యాన్ని ఆరబెట్టి.. భద్రపరిచేందుకు ఆపసోపాలు పడుతున్నాడు.

మెళియాపుట్టి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ధాన్యం ఆరబెట్టేందుకు, వరికుప్పలపై కప్పేందుకు టార్పన్లు లేక అన్నదాతలు అవస్థలు పడుతున్నారు. ప్రస్తుతం తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో అకాల వర్షాలు కురిస్తే తమ పరిస్థితి ఏంటని రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్‌లో 4,47,382 ఎకరాల్లో వరి సాగు చేశారు. 7 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతాయని అధికారులు అంచనా వేశారు. 1.04 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం స్థానికంగా వినియోగించుకోవడానికి, 5 లక్షల మెట్రిక్ టన్నులు లెవీ సేకరణకు లక్ష్యం నిర్ధారించారు. ప్రస్తుతం చాలాచోట్ల వరి కోతలు పూర్తయి.. విక్రయానికి ధాన్యం సిద్ధం చేశారు. కాగా ఇంకా ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలు తెరచుకోలేదు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం.. రైతులు నచ్చిన మిల్లుకు ధాన్యం విక్రయించుకునేలా అవకాశం కల్పించింది. అలాగే వాట్సాప్ సమాచారం ద్వారా కొనుగోళ్లకు సిద్ధమవుతోంది. కాగా గత వైసీపీ ప్రభుత్వం అమలు చేసిన సాఫ్ట్‌వేర్‌లో లోపాల కారణంగా కొనుగోలు ప్రక్రియ ప్రారంభం ఆలస్యమవుతున్నట్టు తెలుస్తోంది. ఇదిలా ఉండగా ధాన్యం కొనుగోలు ప్రక్రియలో తేమ శాతమే ప్రధానం. ధాన్యం 17శాతం తేమ ఉంటేనే కొనుగోలు చేస్తారు. కాగా ధాన్యం (మిగతా 6వ పేజీలో..)



నరసన్నపేట : టార్పన్లు లేక కంబకాయిలో రోడ్డుపై ఆరబెట్టిన ధాన్యం

ఆరాలి.. అమ్మాలి

- రైతులకు షాక్ ఇస్తున్న తేమ శాతం

నరసన్నపేట, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): వరి కోతలు, నూర్పిళ్లు ముమ్మరంగా సాగుతున్నాయి. రైతులు ధాన్యం గింజలను ఇంటికి తీసుకువస్తున్నారు. రైతు సేవాకేంద్రాల్లో ధాన్యం అమ్మేందుకు శాంపిల్స్ తీసుకెళ్తున్నారు. అయితే ధాన్యంలో తేమ శాతం 17 కన్నా ఎక్కువగా ఉంది. రెండు రోజులపాటు ఆరబెట్టాలని, అప్పుడే కొనుగోలు చేస్తామని, తేమ 17శాతం కన్నా ఎక్కువగా ఉంటే అదనంగా ధాన్యం తీసుకోవాల్సి వస్తుందని రైతు సేవాకేంద్రాల్లో అధికారులు చెబుతున్నారు. దీంతో గ్రామాల్లో రైతులు ధాన్యం ఆరబెడుతున్నారు. ఈ ఏడాది ప్రభుత్వం జిల్లాలో 4.90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసేందుకు 402 కేంద్రాలను ఏర్పాటు చేసింది. ధాన్యం విక్రయాలు చేసేందుకు సవాలక్ష ఆంక్షలు విధించడంతో.. రైతులు ధాన్యాన్ని రోడ్లపై అరబెడుతున్నారు. మరోవైపు మిల్లర్లు బ్యాంకు గ్యారెంటీలు ఇవ్వకపోవడందతో కొనుగోళ్లు మందకొడిగా సాగుతున్నాయి. తుఫాన్ హెచ్చరిక నేపథ్యంలో ఎండిన ధాన్యం అయినా కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు. ఏ గ్రామంలో చూసినా రోడ్లన్నీ ధాన్యంతోనే దర్శినమిస్తున్నాయి. వాతావరణం మబ్బులు వేయడంతో ధాన్యంలో తేమ శాతం తగ్గడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఒకరోజు ముందే పింఛన్

- డిసెంబరు 1 ఆదివారం కావడమే కారణం
- వృద్ధులు, దివ్యాంగులకు మరింత వెసులుబాటు
- ఇకపై మూడు నెలలకోసారి నగదు తీసుకోవచ్చు
- లబ్ధిదారుడు మరణిస్తే.. భార్యకు పథకం వర్తింపు

శ్రీకాకుళం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): సామాజిక పింఛన్ దారులకు శుభవార్త. డిసెంబరు 1న ఆదివారం కావడంతో ఒకరోజు ముందే.. అంటే ఈ నెల 30వ తేదీనే పింఛన్ అందించేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. అలాగే అనివార్య కారణాలతో ప్రతినెలా కొంతమంది లబ్ధిదారులు పింఛన్ తీసుకోలేకపోతున్నారు. ఈ నేపథ్యంలో ఇకపై మూడు నెలలకోసారి పింఛన్ తీసుకునేలా వెసులుబాటు కల్పించింది. లబ్ధిదారుడు మరణిస్తే.. ఆ మరుసటి నెల నుంచే ఆయన భార్యకు వితంతువు పింఛన్ పథకం వర్తింపజేయనుంది. ఇలా ఎన్టీఆర్ భరోసా పింఛన్ పథకంలో వివిధ సంస్కరణలు చేయడంతో లబ్ధిదారుల్లో హర్షం వ్యక్తమవుతోంది.

- జిల్లాలో మొత్తం 3,14,385 పింఛన్‌దారులు ఉన్నారు. వీరికోసం ప్రభుత్వం ప్రతినెలా రూ.128.40కోట్లు వెచ్చిస్తుంది. 1,67,199మంది వృద్ధులు, వితంతువులు 74,115 మంది, దివ్యాంగులు 31,692 మంది, నేత కార్మికులు 3,476 మంది, కల్లు గీత కార్మికులు 1,858 మంది, అభయహస్తం 15,667 మంది, ట్రాన్స్‌జెండర్స్ 56 మంది, మత్స్యకారులు 7,272 మంది, ఒంటరి మహిళలు 10,025 మంది ఉన్నారు. వీరితోపాటు క్రానిక్ కిడ్నీ బాధితులు 821 మంది, డీఎంహెచ్ఓ హెల్త్ పింఛన్‌దారులు 1,442 మంది, డప్పు కళాకారులు 1,932 మంది, చర్మకారులు 550 మంది, కళాకారులు 276 మంది, సైనిక్ వెల్ఫేర్ పింఛన్‌దారులు నలుగురు ఉన్నారు. గతంలో సెప్టెంబరు 1న ఆదివారం కావడంతో.. ఆగస్టు 31నే పింఛన్ పంపిణీ చేశారు. ఈ సారీ కూడా అదే విధానం అమలుకానుంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 30వ తేదీనే పింఛన్లు పంపిణీ చేసేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 28న లబ్ధిదారుల సంఖ్య మేరకు ప్రభుత్వం.. పింఛన్ నగదును బ్యాంకు ఖాతాలో జమ చేయనుంది. 29న ఆ నగదును సచివాలయ సిబ్బంది విత్ డ్రా చేసి.. 30న లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నారు. దీనివల్ల వృద్ధులు, దివ్యాంగులు.. అలాగే మందుల కొనుగోలు కోసం ఎదురుచూసేవారికి కొంత ఉపశమనం లభించనుంది.

● మూడు నెలలకోసారి..

గత ప్రభుత్వంలో ఏ నెల పింఛన్.. ఆ నెలలోని తొలి నాలుగైదు రోజుల్లో మాత్రమే తీసుకోవాలి. తర్వాత లబ్ధిదారులు సచివాలయాలకు వెళ్లినా (మిగతా 6వ పేజీలో..)

29 నుంచి అల్పపీడనం

- ధాన్యం తడవకుండా చూడాలి: కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): 'అల్పపీడనం కారణంగా జిల్లాలో ఈ నెల 29 నుంచి వర్షాలు కురిసే అవకాశం ఉంది. ధాన్యం తడవకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాల'ని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో కలిసి నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 'కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉంచిన ధాన్యం తడిచిపోకుండా చూడాలి. రైతులకు టార్పన్లు, టెంట్‌లు, గోనె సంచులు, ఇతర అవసరమైన వసతులను అందించాలి. అన్ని కేంద్రాల్లోనూ వచ్చిన ధాన్యం సేకరించాలి. మెళియాపుట్టిలో 1000 ఎకరాలకు తక్కువ కాకుండా భూమిని సేకరించి ల్యాండ్ బ్యాంక్ సిద్ధం చేయాలి. కేంద్ర నిధులతో ప్రతీ నియోజకవర్గ కేంద్రంలో బ్యాడ్మింటన్ కోర్టులు ఏర్పాటు చేయాలి. అందుకోసం ఎకరా చొప్పున భూమిని సేకరించాలి. ఆయా చోట్ల ఇండోర్, ఔట్‌డోర్ కోర్టులను నిర్మిస్తాం. పల్లె పండుగలో శంకుస్థాపన చేసిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలి' అని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో డీఆర్వో ఎం.వెంకటేశ్వరరావు, ఉప కలెక్టర్లు పద్మావతి, అప్పారావు, వ్యవసాయాధికారి త్రినాథస్వామి, డీపీఓ భారతి సౌజన్య, ఐసీడీఎస్ పీడీ బి.శాంతిశ్రీ, సీపీఓ ప్రసన్నలక్ష్మి, డీఆర్డీఏ పీడీ కిరణ్‌కుమార్, డీఎంహెచ్‌వో బి.మీనాక్షి పాల్గొన్నారు.

మీకింత.. మాకింత!

- రెండు నదుల్లో ఇసుక అక్రమ తవ్వకాలు
- ఇష్టారాజ్యంగా నకిలీ బిల్లుల చెలామణి
- రోజూ 200 లారీలకుపైగా తరలింపు
- అన్ని పార్టీల నాయకులూ భాగస్వాములే



నాగావళి నది పరివాహక ప్రాంతంలో ఇసుక నిల్వలు



ఆమదాలవలస: వంశధార తీరంలో..

ఆమదాలవలస, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. ఆమదాలవలస నియోజకవర్గంలో రెండు నదులు ఉండడం.. ఇసుకాసురుల పాలిట కాసులు కురిపించే కల్పతరువుగా మారింది. వైసీపీ హయాంలో అక్రమార్కులు ఇసుక అధిక ధరకు విక్రయించి సొమ్ము చేసుకున్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం.. ఇసుక ఉచిత విధానం అమలు చేస్తున్నా.. దందా కొనసాగిస్తూనే ఉన్నారు. ఉచిత ఇసుక పేరిట వంశధార, నాగావళి నదీ పరివాహక ప్రాంత గ్రామాలకు చెందిన కొంతమంది వ్యక్తులు ట్రాక్టర్లతో ఇసుకను తరలించి డంపింగ్ చేస్తున్నారు. విశాఖపట్నం, విజయనగరం ప్రాంతాలకు చెందిన లారీలకు ఆ ఇసుకను విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. స్థానికంగా అన్నిపార్టీల నేతలు ఇసుక అక్రమ వ్యాపారంలో భాగస్వామ్యం కావడం గమనార్హం. సరుబుజ్జిలి, ఆమదాలవలస, బూర్జ మండలాల్లోని వంశధార, నాగావళి నదుల నుంచి ఇసుక అక్రమ వ్యాపారం జోరుగా సాగుతోంది. రోజూ సుమారు 200 నుంచి 300 లారీల ఇసుక రవాణా చేస్తున్నారు. ఒక్కో లోడు రూ.15వేల నుంచి రూ.20 వేల వరకు విక్రయిస్తున్నారు. ఇసుకాసురులు ఏకంగా ప్రభుత్వ ఇసుక ర్యాంపుల బిల్లులను.. నకిలీవి రూపొందించి అక్రమాలకు పాల్పడుతున్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ నెల 22 న ఉదయం 10 నుంచి 23న ఉదయం 10 గంటల వరకు అన్ని ప్రభుత్వ ఇసుక ర్యాంప్‌లను సాంకేతిక కారణాలతో నిలిపేశారు. అయితే ఆమదాలవలస నియోజకవర్గంలోని ఒక ర్యాంప్ పేరుతో 22న రాత్రి 8 గంటల సమయంలో ఇసుక అక్రమ రవాణా చేశారు. నకిలీ బిల్లులతో ఆ ఇసుక అక్రమ రవాణా చేస్తున్నట్టు పోలీసులు గుర్తించి.. ఏడు లారీలను గనులశాఖకు అప్పగించారు. ఇదిలా ఉండగా ఆమదాలవలస నియోజకవర్గంలో ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణా సాగుతున్నా గనులు, రెవెన్యూ, పోలీసు శాఖల అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. పర్యవేక్షణ లోపంతో ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతుందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇసుకాసురుల అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని పలువురు కోరుతున్నారు.

> కూటమి ప్రభుత్వం సదుద్దేశంతో ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేస్తోంది. తద్వారా పేదల ఇసుక కష్టాలను తీరుస్తోంది. అయితే రాజకీయ నాయకుల ప్రమేయం కారణంగా ఈ విధానానికి తూట్లు పడుతోంది. అన్నిపార్టీలకు చెందిన కొందరు స్థానిక నాయకులు దీన్ని ఆదాయ వనరుగా మార్చుకున్నారు. 'మీకింత.. మాకింత' అన్న ధోరణిలో దందా సాగిస్తున్నారు. ఇసుకను అడ్డుగోలుగా తవ్వేసి నకిలీ బిల్లులతో తరలించేస్తున్నారు.



బిడిమి-అనకాపల్లి మధ్యలో ఎయిర్‌పోర్టు నిర్మాణానికి సేకరిస్తున్న స్థలం ఇదే..
(ఉపగ్రహ ఛాయాచిత్రం ద్వారా)

ఎయిర్ పోర్టుతో కొత్తకళ

- పలాసకు ప్రత్యేక గుర్తింపు
- విశాఖ-భువనేశ్వర్ అంతర్జాతీయ విమానాశ్రయాలతో అనుసంధానం
- గోపాల్‌పూర్ నేవీ, మిలటరీ సర్వీసులకు సులభతరం
- మూలపేట పోర్టుకు అనుసంధానంగా భారీ కారిడార్

పలాస, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మందస, వజ్రపుకొత్తూరు మండలాల తీర ప్రాంతంలో ఎయిర్‌పోర్టు నిర్మాణం దిశగా చురుగ్గా అడుగులు పడుతున్నాయి. ఈ మేరకు ఎయిర్‌పోర్టు అథారిటీ అధికారులు రెండు రోజుల కిందట ఈ రెండు మండలాల్లో బిడిమి నుంచి అనకాపల్లి గ్రామం వరకూ సర్వే చేశారు. ఇది అనువైన ప్రాంతంగా గుర్తించారు. ఈ మేరకు కేంద్ర విమానయాన శాఖకు నివేదిక ఇవ్వ నున్నారు. ఇది కార్యరూపం దాల్చితే పలాస నియోజకవర్గం అంతర్జాతీయంగా గుర్తింపు పొందుతుంది. భువనేశ్వర్(ఒడిశా), భోగాపురం ఎయిర్ పోర్టులకు పలాస కోస్టల్ ఎయిర్‌పోర్టు అనుసంధానంగా పనిచేసే అవకాశం ఉంది. ఒడిశాలోని గోపాల్‌పూర్‌లో ఉన్న నేవీ, మిలటరీ బేస్‌కు కూడా ఉపయోగంగా ఉంటు ంది. సంతబొమ్మాళి మండలం మూలపేట పోర్టుకు ఎయిర్‌పోర్టు నుంచి ఆరు లైన్ల రహదారి నిర్మాణం పూర్తయితే కోస్టల్ కారిడాల్ అభివృద్ధి సులభతరమవుతుంది. ఈ మేరకు కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు చొరవతో ఎయిర్‌పోర్టు ఏర్పాటు దిశగా అధికారులు అడుగులు వేస్తున్నారు. ఇప్పటికే పలాస నియో జకవర్గం కొబ్బరి, జీడి ఉత్పత్తులతో ప్రపంచ ఖ్యాతి పొందింది. ఏటా రూ.500 కోట్ల మేర జీడి ఉత్పత్తులు దేశ, విదేశాలకు తరలుతున్నాయి. ఎయిర్ పోర్టు పూర్తయితే కార్గో సేవలు వినియోగించుకోవచ్చనే అభిప్రాయాన్ని వ్యాపారులు వ్యక్తం చేస్తున్నారు.

విశాఖ-భువనేశ్వర్‌కు (మిగతా 6వ పేజీలో)

'ఎచ్చెర్ల'లో ఏసీబీ సోదాలు

- గ్రేటర్ విశాఖ జోన్-2 కమిషనర్ బంధువుల ఇళ్లల్లో తనిఖీలు
- బినామీ పేరిట ఆస్తులపై ఆరా

ఎచ్చెర్ల, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ఎచ్చెర్ల మండలంలో ఏసీబీ తనిఖీలతో అలజడి రేగింది. గ్రేటర్ విశాఖపట్నం మునిసిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) జోన్-2 కమిషనర్ పొందూరు సింహాచలం ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉండడంతో ఏసీబీ అధికారులు కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో కమిషనర్ సింహాచలం బంధువుల ఇళ్లల్లో కూడా మంగళవారం ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. కమిషనర్ స్వగ్రామమైన ఎచ్చెర్ల మండలం కేశవరావుపేటలో తల్లిదండ్రులు ఉంటున్నారు. ఇక్కడ ఇల్లుతోపాటు కింతలిలోని అత్తవారింట్లో, ఇదే మండలం కొత్తపేటలో తన వియ్యంకుడి ఇంట్లో సోదాలు చేశారు. సింహాచలం ఆస్తుల వివరాలను, బినామీల పేరిట ఆస్తులు ఏమైనా ఉన్నాయా? అని ఆరా తీశారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు సోదాలు జరిగాయి. ఈ క్రమంలో జిల్లాలో 13 ఇళ్ల స్థలాలు, కింతలిలో 4.6ఎకరాల వ్యవసాయభూమి, ఒక మారుతి బ్రెజ్జా కారు, 500 గ్రాములు బంగారం, ఆరు బ్యాంకు అకౌంట్లలో రూ.ఐదు లక్షలు నగదు ఉన్నట్టు గుర్తించారు. మొత్తంగా జిల్లాతోపాటు మధురవాడ, కాపులుప్పాడ, పరదేశిపాలెం తదితర ప్రాంతాల్లో భారీగా ఆస్తులు కూడబెట్టినట్టు నిర్ధారించారు.

రాజ్యాంగంపై అవగాహన తప్పనిసరి

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): 'రాజ్యాంగం కారణంగా మనమంతా స్వేచ్ఛా జీవితాన్ని గడుపుతున్నాం. రాజ్యాంగంపై అందరూ అవగాహన కలిగి ఉండాలి. తద్వారా ఉన్నత విలువల గల సమాజ నిర్మాణం సాధ్యమవుతుంద'ని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పేర్కొన్నారు. 75వ రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ చిత్రపటానికి జేసీ ఫర్మాన్‌అహ్మద్ ఖాన్‌తో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డీఆర్వో వేంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఉప కలెక్టర్లు అప్పారావు, పద్మావతి, ఇతర జిల్లా అధికారులు సిబ్బంది పాల్గొన్నారు. అలాగే పలు పాఠశాలల్లో విద్యార్థులు వేడుకలు నిర్వహించారు.



అంబేడ్కర్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న కలెక్టర్



పలాస రూరల్: బ్రాహ్మణతర్లా జడ్పీ పాఠశాలలో ఆకట్టుకున్న విద్యార్థుల ప్రదర్శన

నర్తనశ్రీ రామూ..



నృత్య ప్రదర్శనలో శ్రీరాములు



టెక్కలి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి):

టెక్కలి పట్టణంలోని వెంకటేశ్వర కాలనీలో నివాసముంటున్న బగ్గు శ్రీరాములు స్వస్థలం నరసన్నపేట మండలం ఉర్లాం సమీపంలోని ముద్దాడపేట. 1991లో కండక్టర్ ఉద్యోగం వచ్చింది. వృత్తిరీత్యా 24 ఏళ్ల కిందట టెక్కలికి వచ్చి ఇక్కడ నివాసం ఏర్పరచుకున్నారు. శ్రీరాములుకు చిన్నప్పటి నుంచీ కూచిపూడి నృత్యమంటే మక్కువ. విజయనగరంలోని ఎల్.రవికుమార్ గురువు వద్ద కూచిపూడి నేర్చుకుని ప్రావీణ్యం సాధించారు. కండక్టర్‌గా ఉద్యోగం వచ్చినప్పటికీ నాట్యంపై ఇష్టం చంపుకోలేకపోయారు. ఒకపక్క విధులు నిర్వహిస్తూనే మరోపక్క వివిధ ప్రాంతాల్లో నాట్య ప్రదర్శనలు ఇస్తున్నారు. మహిళా వేషధారణలో కూచిపూడి నృత్యంలో రాణిస్తున్నారు. శ్రీమన్నారాయణ, అన్నమాచార్య కీర్తనలు, శ్రీనివాస నృత్య రూపకం, అలివేలుమంగా విలాసం, వినాయక కవిత్వం, పుత్తడిబొమ్మ పూర్ణమ్మ, అష్టలక్ష్మి నమోస్తుతే, శివతాండవం- భామా కలాపం తదితర ప్రదర్శనలు చేశారు. ఈ ఏడాది అక్టోబరు నెలలో బెనారస్ యూనివర్సిటీ వారణాసిలో, అలాగే కాశీవిశ్వనాథుని ఆలయంలో కూచిపూడి నృత్యప్రదర్శనలు చేశారు. న్యూఢిల్లీ ఏపీ భవన్, హైదరాబాద్ రవీంద్రభారతి, కృష్ణ, గోదావరి పుష్కరాలు, తిరుచూరు పద్మావతి బ్రహ్మోత్సవాలు, తిరుపతి బ్రహ్మోత్సవాలు, విజయవాడ శరన్నవరాత్రులు, హైదరాబాద్ త్యాగరాజు గాన సభలు, బిలాయి స్టీల్‌ప్లాంట్ రజతోత్సవాలు, కోల్‌కత్తా తెలుగు సాంస్కృతిక కార్యక్రమాలు, ఏపీ డ్యాన్స్ ఫెస్టివల్, అనంతపురం, హైదరాబాద్, విశాఖ, తిరుపతి ఆర్టీసీ రాష్ట్రస్థాయి సాంస్కృతిక ఉత్సవాలు, హైదరాబాద్ దూరదర్శిని మువ్వలసవ్వడి కార్యక్రమం, విజయవాడ దూరదర్శన్ పుత్తడిబొమ్మ నృత్య రూపకం.. వంటి ఎన్నో ప్రదర్శనలతో అలరించారు.

కూచిపూడి నృత్యం అతనికి ఆరో ప్రాణం. అవకాశం దొరికినప్పుడల్లా ప్రదర్శనలు ఇవ్వడం, ప్రశంసలు అందుకోవడం అలవాటు. ఓ వైపు ఆర్టీసీ బస్సు కండక్టర్‌గా విధులు నిర్వహిస్తూనే, మరోవైపు కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఇవ్వడం అలవర్చుకున్నారు. మూడు దశాబ్దాల కిందట కండక్టర్‌గా విధుల్లోకి చేరినప్పటి నుంచి ఉమ్మడి తెలుగు రాష్ట్రాలతో పాటు దేశంలోని పలు ప్రాంతాల్లో స్త్రీ వేషధారణల్లో వేల సంఖ్యలో నృత్య ప్రదర్శనలు చేసి మన్ననలు పొందారు. ఆయనే బగ్గు శ్రీరాములు.

- మహిళా వేషధారణలో నాట్య ప్రదర్శనలు
- కూచిపూడి నృత్యంలో రాణిస్తున్న ఆర్టీసీ కండక్టర్
- ఎన్నో అవార్డులు బగ్గు శ్రీరాములు సొంతం

అవార్డులు..

బగ్గు శ్రీరాములు ఎన్నో అవార్డులు, రివార్డులు అందుకున్నారు. డాక్టర్ సి.నారాయణరెడ్డి నుంచి నర్తనశ్రీ అవార్డు, కిన్నెర నృత్యోత్సవంలో మల్లె మాల అవార్డు, కోల్‌కత్తా తెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉగాది పురస్కారం, ప్రముఖ నాట్యమయూరి మంజుభార్గవి చేతుల మీదుగా పురస్కారం, నాట్యాచార్యులు కోరాడ నర్సింహరావు నుంచి నృత్యభారతి పురస్కారం పొందారు. సినీనటుడు కైకాల సత్యనారాయణ, ఆర్టీసీ ఎండీలు, కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ఎందరో ఉన్నతాధికారులు, టీటీడీ చైర్మన్ చేతుల మీదుగా ఎన్నో అవార్డులు, ప్రశంసలు అందుకున్నారు.

విదేశాల్లో ప్రదర్శనలు చేయాలని ఉంది..

నాకు విదేశాల్లో ప్రదర్శనలు చేయాలని ఉంది. అణగారిపోతున్న కళారంగానికి ప్రభుత్వం ప్రోత్సాహం అందించాలి. విరివిగా నృత్య కళాశాలలు ఏర్పాటు చేయాలి.

- బగ్గు శ్రీరాములు, కూచిపూడి నృత్యకారుడు



కొత్త రేషన్ కార్డులు వచ్చేస్తున్నాయ్

- వచ్చే నెల నుంచి దరఖాస్తుల స్వీకరణ
- మార్పులు, చేర్పులకు కూడా అవకాశం



హిరమండలం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కొత్త రేషన్ కార్డులకు కోసం ఎదురుచూపులే మిగిలాయి. కార్డు కావాలని దరఖాస్తు చేసుకున్న వేలమంది పేదలకు నిరాశే మిగిలింది. కొత్తగా వివాహమైన వారు, కార్డుల్లో నమోదైన వారిని విభజించాలని రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరిగినా పట్టించుకోలేదు. మార్పులు, చేర్పులను పూర్తిగా పక్కన పెట్టేశారు. వృద్ధులకు, వితంతువులకు సామాజిక పింఛన్లు మంజూరు చేయాలన్నా.. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ అందాలన్నా.. దీపం-2 పథకం వర్తింపజేయాలన్నా రేషన్ కార్డు కచ్చితంగా కలిగి ఉండాలి. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు కూడా రేషన్‌కార్డు తప్పనిసరి. దీంతో పేదలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. పథకాలు దరిచేరక కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ఈ నేపథ్యంలో గాడి తప్పిన ప్రజాపంపిణీ వ్యవస్థను ప్రక్షాళన చేసే దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

ఉన్నవి తొలగించారు

వైసీపీ ప్రభుత్వం హయాంలో అంతకుముందు ఉన్న కార్డులను నిలిపివేశారు. వాటి స్థానంలో జగన్‌మోహన్ రెడ్డి చిత్రాలు, పార్టీ రంగులతో కొత్తగా కార్డులు ముద్రించి లబ్ధిదారులకు అందజేశారు. ఆ సమయంలో ప్రజాధనం వృథా చేస్తున్నారంటూ పెద్దఎత్తున విమర్శలు వచ్చాయి. అప్పట్లో కొత్త కార్డులకు దరఖాస్తు చేసుకున్న వారికి ఐదు రోజుల్లో ఇస్తామని గొప్పలు చెప్పి ఆచరణలో మాత్రం పెట్టలేదు. కొత్తవి ఇవ్వకపోగా చాలా మందివి ఉన్న కార్డులను తొలగించారు.

డిసెంబరు 2 నుంచి దరఖాస్తులు

కొత్తగా రేషన్ కార్డులు కావాలనుకునేవారు డిసెంబరు 2 నుంచి 28 వరకు గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తులు ఇవ్వాలని కూటమి ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. కొత్త కార్డులు, మార్పులు, చేర్పులు కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. విచారించిన తర్వాత అర్హులకు జనవరి 2వతేదీన కొత్త కార్డులు అందజేయనున్నారు.

ఈ చిత్రంలో కనిపిస్తున్న మహిళ హిరమండలం మండలం రుగడ పంచాయతీ బొమ్మికగూడ గ్రామానికి చెందిన రైత సారా. ఈమెది నిరుపేద గిరిజన కుటుంబం. ఈమెకు ఆరుగురు సంతానం. గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వం హయాంలో రేషన్ కార్డు కోసం కార్యాలయాలు చుట్టూ తిరిగినా ఫలితంలేకపోయింది. ఐదు నెలల కిందట ఈమె భర్త అనారోగ్యంతో మృతి చెందాడు. కార్డు ఉంటే ప్రభుత్వ అందించే రేషన్ సరుకులతో కుటుంబ పోషణకు కొంత ఆసరగా ఉండేది. రేషన్ కార్డుల లేకపోవడంతో వితంతు పింఛన్‌కు కూడా దరఖాస్తు చేసుకోలేక పోయింది. కూటమి ప్రభుత్వం కొత్తగా రేషన్ కార్డులు మంజూరుకు చర్యలు చేపట్టడంతో ఆనందంతో దరఖాస్తు చేసుకునేందుకు సిద్ధమయ్యారు. ఇలాంటి వారు జిల్లాలో ఎంతోమంది ఉన్నారు. కూటమి ప్రభుత్వం నిర్ణయంతో వీరందరికి ప్రయోజనం చేకూరుతుందని ఆశిద్దాం.



ప్రస్తుతం జిల్లాలో ఇలా..

రేషన్ దుకాణాలు :	1,625
రేషన్ కార్డులు :	6,71,803
లబ్ధిదారులు :	19,77,698
తెల్ల కార్డులు :	6,35,471
అంత్యోదయ :	36,332

ఐపీఎల్‌కు టెక్కలి అబ్బాయి

- ఢిల్లీ క్యాపిటల్స్ తరఫున బరిలోకి విజయ్
- ప్రస్తుతం ఆంధ్రా క్రికెట్ జట్టుకు ప్రాతినిధ్యం



బ్యాటింగ్ చేస్తున్న విజయ్

టెక్కలి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ఐపీఎల్ టీమ్‌లో టెక్కలి యువకుడికి చోటు లభించింది. టెక్కలి యువకుడికి చోటు లభించింది. త్రిపురాన విజయ్ రైట్‌హ్యాండ్ బ్యాటింగ్, రైట్ ఆర్మ్ ఆఫ్‌స్పిన్నర్, ఫీల్డింగ్, ఆల్‌రౌండర్‌గా గుర్తించి ఢిల్లీ క్యాపిటల్ రూ.30 లక్షల బేస్‌ప్రైస్‌కు కొనుగోలు చేసింది. దశాబ్ద కాలంగా క్రికెట్‌లో రాణిస్తున్న విజయ్ ప్రస్తుతం జరుగుతున్న రంజీ ట్రోఫీ పోటీల్లో ఆంధ్రా జట్టు తరుపున ఆడుతున్నాడు. వాస్తవానికి గత ఏడాది ముంబై ఇండియన్స్, పంజాబ్ కింగ్స్ లెవన్ తరుపున ఐపీఎల్‌లో అవకాశం లభిస్తుందని అనుకున్నారు. కానీ ఎంపిక కాలేదు. ఈసారి ఆంధ్రా జట్టు తరుపున రంజీ, విజయాహజారే, సయ్యద్ ముస్తక్ ఆలీ క్రికెట్ పోటీల్లో రాణిస్తుండడంతో ఢిల్లీ క్యాపిటల్స్ విజయ్‌ను కొనుగోలు చేసింది. ఆంధ్రా క్రికెట్ అకాడమీతో పాటు బెంగళూరులో కూడా శిక్షణ పొంది ఆల్‌రౌండర్‌గా రాణిస్తున్న విజయ్ మణికట్టు తిప్పితే వికెట్ పడాల్సిందే.

- ఇప్పటికే ఆంధ్రా ప్రీమియర్ లీగ్ టీ-20 మ్యాచ్‌ల్లో గోదావరి టైటాన్స్ జట్టు తరుపున పాల్గొన్న విజయ్ బెస్ట్‌ఫీల్డర్‌గా ఎంపిక కావడంతో ప్రస్తుత బీసీసీఐ అధ్యక్షుడు రోజర్‌బిన్నీ చేతులు మీదుగా షీల్డ్‌తో పాటు రూ.50వేల నగదు బహుమతి అందుకున్నాడు. ఈసారి రంజీట్రోఫీ మ్యాచ్‌ల్లో ఆంధ్రా జట్టు తరుపున విదర్భ జట్టుపై నాలుగు వికెట్లు, హైదరాబాద్ జట్టుపై ఐదు వికెట్లు తీసి ఆంధ్ర జట్టు గెలుపునకు కారకుడిగా నిలిచాడు. ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతున్న సయ్యద్ ముస్తక్ ఆలీ, టీ-20 పోటీల్లో ఆంధ్రా జట్టు తరుపున పాల్గొన్నాడు. సోమవారం నాగాలాండ్ జట్టుపై నాలుగు వికెట్లు సాధించి ఆంధ్రా జట్టును విజేతగా నిలిపాడు. బుధవారం గోవాతో మరో మ్యాచ్ ఆడనున్నాడు.
- తమ కుమారుడు ఐపీఎల్‌కు ఎంపిక కావడం గర్వంగా ఉందని తల్లిదండ్రులు త్రిపురాన క్రిష్ణమరాజు, లావణ్య ఆంధ్రజ్యోతికి తెలిపారు. ప్రస్తుతం విజయ్ డిగ్రీ ప్రథమ సంవత్సరం దూరవిద్యాకేంద్రంలో చదువుతున్నాడని అన్నారు.

అభినందించిన కేంద్ర, రాష్ట్ర మంత్రులు

ఐపీఎల్‌కు ఢిల్లీ క్యాపిటల్స్ తరపున ఎంపికైన త్రిపురాన విజయ్‌కు కేంద్ర, రాష్ట్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్‌నాయుడు, కింజరాపు అచ్చెన్నాయుడు అభినందనలు తెలిపారు. భవిష్యత్‌లో జాతీయ జట్టులో స్థానం సంపాదించి ఉత్తమ క్రికేటర్‌గా ఎదగాలని ఆకాంక్షించారు.

జాతీయ జట్టులో స్థానం సంపాదించాలన్నదే..

భారత జట్టు తరుపున ఆడాలన్నదే నా ఆకాంక్ష. అందుకు అవసరమైన సాధన చేస్తా. ఐపీఎల్‌లో కూడా సత్తా చాటాలని ఉంది. నన్ను ప్రోత్సహించిన ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్, జిల్లా క్రికెట్ అసోసియేషన్ ప్రతినిధులకు, తల్లిదండ్రులకు రుణపడి ఉన్నాను.

- త్రిపురాన విజయ్, క్రికెటర్





పామును పట్టుకొని గోనెలో బంధిస్తున్న ఓంకార్ త్యాడి బృందం

బావిలో రక్తపింజరి పాము

- చాకచక్యంగా పట్టుకున్న స్నేక్‌స్నాచర్
- అటవీ సిబ్బంది సాయంతో అడవిలోకి..



రక్తపింజరి జాతికి చెందిన పాము

పలాస, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): పలాస-కాశీబుగ్గ జంటపట్టణాల్లోని బావిలో ప్రమాదకరమైన రక్తపింజరి పామును ఈస్ట్రన్ గాడ్స్ వైల్డ్‌లైఫ్ సభ్యుడు ఓంకార్ త్యాడి మంగళవారం పట్టుకుని అటవీ సిబ్బంది సహకారంతో అడవుల్లో విడిచిపెట్టారు. ఇది ఆరున్నర అడుగుల పొడవు ఉంది. ఉదయం ఏడు గంటల సమయంలో కూరగాయలు సేకరించడానికి వెళ్లిన రైతులకు బావిలో కదిలిన శబ్దం రావడంతో పరిశీలించగా భారీ రక్త పింజరి పాము కనిపించింది. అటవీశాఖ అధికారులు ఓంకార్‌త్యాడిని తీసుకుని బావి వద్దకు వచ్చారు. తొలుత అది నాగుపామని భావించారు. దానిపై మచ్చలు ఉండడంతో ప్రమాద కరమైన రక్తపింజరిగా గుర్తించారు. ఇది ఎక్కువగా పంట పొలాలు, కొండ ప్రాంతాల్లో ఉంటుంది. ఇది కరిచిన వెంటనే అపస్మారకస్థితికి వెళ్లడంతోపాటు చర్మం ముక్కముక్కలుగా రాలిపోయి మరణం సంభవిస్తుందని చెబుతున్నారు. కరిచిన వెంటనే తేరుకుని సరైన మందులు వాడితే ప్రాణహాని ఉండదని అంటున్నారు. ఓంకార్‌త్యాడి పామును చాకచక్యంగా పట్టుకుని సమీప అడవుల్లో విడిచిపెట్టారు. ఐదు రోజుల క్రితం ఇదే బృందం మెళియాపుట్టి మండలం కరజాడ గ్రామ సమీపంలో అమ్మవారి ఆలయం పొలాల్లో 20 అడుగుల భారీ కొండచిలువను పట్టుకుని అడవుల్లో విడిచిపెట్టింది. ఇదే మండలం పెద్దమడి ఆశ్రమపాఠశాల తరగతి గదుల్లోకి వెళ్లిన కింగ్‌కోబ్రాను సైతం పట్టుకుని అడవిలో సురక్షితంగా వదిలిపెట్టింది. ఈ సందర్భంగా ఓంకార్‌త్యాడి విలేకర్లతో మాట్లాడుతు పాములు మనుషులకు ఎలాంటి ప్రమాదం చేయవని, వాటికి హాని తలపెట్టినట్లు గుర్తిస్తే భయంతో కాటు వేస్తాయని అన్నారు. అంతరించిపోతున్న జాబితాలో ఉన్న ఇలాంటి పాములు కనిపిస్తే తమకు సమాచారం అందించాలని కోరారు.

వానొస్తే ఎలా..?

(ఐదో పేజీ తరువాయి)

ఆరబెట్టేందుకు టార్పన్లు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో 50 శాతం రాయితీపై టార్పన్లు అందజేసేవారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో రాయితీపై టార్పన్లు పంపిణీ నిలిపేశారు. దీంతో మార్కెట్‌లో కొనుగోలు చేస్తున్నామని రైతులు పేర్కొంటున్నారు. కొంతమంది వ్యాపారులు రాజమండ్రి తదితర ప్రాంతాల నుంచి టార్పన్లు తీసుకువచ్చి 30 మీటర్లు సుమారు రూ.వెయ్యి చొప్పున విక్రయిస్తున్నారు. టార్పన్లు కొనుగోలుతో తమపై అదనపు భారం పడుతోందని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం స్పందించి రాయితీపై టార్పన్లు పంపిణీ చేయాలని, ధాన్యం కొనుగోలు ప్రక్రియ ప్రారంభించాలని కోరుతున్నారు. ఈ విషయమై పలాస ఏడీ ఎల్.మధుబాబు వద్ద ప్రస్తావించగా.. టార్పన్లు పంపిణీకి సంబంధించి ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆదేశాలు రాలేదని తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో స్వచ్ఛంద సంస్థలు ద్వారా గిరిజన రైతులకు టార్పన్లు పంపిణీ చేస్తున్నారన్నారు. తేమ 17శాతం వచ్చేవరకూ ఆరబెట్టాలని స్పష్టం చేశారు.

ఒకరోజు ముందే.. పింఛన్

(ఐదో పేజీ తరువాయి)

నగదు ఇచ్చేవారు కాదు. అలాగే రెండు నెలలు పింఛన్ తీసుకోకపోయినా రద్దయ్యేది. పింఛన్ పునరుద్ధరించేందుకు లబ్ధిదారులకు.. అధికారులకు చాలా ఇబ్బందులు ఏర్పడేవి. ఇప్పుడా సమస్య లేదు. లబ్ధిదారులు వరుసగా రెండు నెలల పింఛన్ తీసుకోకపోయినా.. మూడో నెల ఒకేదఫా నగదు మొత్తాన్ని అందజేయనున్నారు. దీనివల్ల మధ్యతరగతి ప్రజలకు, కూలీలకు, దీర్ఘకాలిక రోగాలతో ఎక్కడెక్కడో చికిత్స పొందుతున్నవారికీ ఉపశమనం కలిగినట్లైంది.

లబ్ధిదారుడు మరణిస్తే.. భార్యకు పెన్షన్ వర్తింపు..

వితంతువు పింఛన్ మంజూరు చేయాలంటే.. ఇన్నాళ్లూ కొత్తగా దరఖాస్తు చేసుకోవాల్సిందే. కానీ ఇప్పుడు ఆ నిబంధనను మార్పుచేశారు. లబ్ధిదారుడు మరణిస్తే.. అతని భార్యకు ఆ పింఛన్‌ను బదలాయిస్తారు. భర్త మరణ ధ్రువపత్రాలను సచివాలయాల్లో అందజేయాలి. గతంలో మాదిరి రాజకీయనాయకుల సిఫార్సులు.. ఇతరత్రా దరఖాస్తులు చేయాల్సిన పనిలేదు. ప్రతి నెలా జిల్లాలో వృద్ధులు 800 మంది నుంచి 1200 మంది వరకు మరణిస్తుంటారు. వారిలో కొంతమందికి ప్రభుత్వ తాజా చర్యలు వల్ల ప్రయోజనం కలుగుతుంది.

ఎయిర్ పోర్టుతో కొత్తకళ

(ఐదో పేజీ తరువాయి)

మధ్యగా పలాస ఎయిర్ బేస్ ఉంటుంది. రెండు రాష్ట్రాలకు చెంది న ప్రయాణికులు దీన్ని వినియోగించుకోవడా నికి అవకాశం ఉంటుంది. పలాసలో ఇప్పటికే రైల్వే స్టేషన్ ఆధునీకరణకు కేంద్ర ప్రభుత్వం రూ.24 కోట్లు విడుదల చేసింది. ఆ పనులు కూ డా చకచకా జరుగుతున్నాయి. రెండేళ్ల కిందట భావనపాడు పోర్టుపై విస్తృత ప్రచారం జరగ డంతో వజ్రపుకొత్తూరు మండల కేంద్రం నుంచి జాతీయ రహదారి బెండి గేటు వరకూ భూము ల ధరలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. రూ.లక్షల్లో ఉండే ఎకరా భూమి ధర రూ.కోట్లు పలి కింది. పోర్టు కాస్త మూలపేటకు వెళ్లిపోవడంతో భూముల ధరలు అంతే స్థాయిలో పడిపోయా యి. ప్రస్తుతం మందస, వజ్రపుకొత్తూరు సరిహద్దులో తీర ప్రాంతంలో ఎయిర్‌పోర్టు నిర్మాణా నికి భూముల సర్వే జరుగుతుండడంతో ఆ ప్రాంతంలో కూడా అప్పుడే రియల్ ఎస్టేట్ బ్రోక ర్లు జిరాయితీ భూములపై ఆరా తీస్తున్నారు. గ్రామాల్లో వారి బంధువుల నుంచి వివరాలు సేకరించే పనిలో ఉంటున్నారు. పలాస నుంచి మందస జాతీయ రహదారి, వజ్రపుకొత్తూరు మండలంలో మెట్టూరు వరకూ ప్రధాన రహ దారి గుండా ఉండే భూములపై అప్పుడే బేరసా రాలు జరిగిపోతున్నాయి. రాష్ట్రంలో ఎయిర్‌పోర్టు లకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఇన్‌ఫ్రాస్ట్రక్చ ర్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ డెవలప్‌మెంట్ (ఏపీఏడీ సీఎల్)కు భూముల సర్వే కోసం రూ.1.92 కోట్లు నిధులు విడుదల చేసిన విషయం తెలిసిందే. కొత్తగా కుప్పం, నాగార్జునసాగర్, తాడేపల్లి గూడెం, తుని, ఒంగోలుతో పాటు పలాస ఎయిర్ పోర్టులను నిర్మించేందుకు సంకల్పిం చింది. పలాస ఎయిర్‌పోర్టుకు 1383.71 ఎక రాలు అవసరం ఉందని గుర్తించారు. ఆ మేరకు సర్వేలు ప్రారంభమయ్యాయి. మొత్తం ప్రక్రియ పూర్తయి ఎయిర్‌పోర్టు నిర్మాణానికి శ్రీకారం చుడితే ప్రపంచ పటంలో పలాసకు ప్రత్యేక గుర్తింపు వస్తుందని ఈ ప్రాంతీయులు ఆశాభా వం వ్యక్తం చేస్తున్నారు.

రబీలో సాగునీరు ఇవ్వలేం

- వంశధార ఈఈ శేఖరరావు



మాట్లాడుతున్న వంశధార ఈఈ శేఖరరావు

టెక్కలి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): అవసరమైన నీటి నిల్వలు లేకపోవడం వల్ల రబీ సీజన్‌లో సాగునీరివ్వలేమని వంశధార ఈఈ బి.శేఖరరావు అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గొట్టా బ్యారేజీలో ఆశించిన మేర నీటి నిల్వలు లేకపోవడం, ఒడిశా క్యాచ్‌మెంట్ ఏరియాలో రెండు నెలలుగా వర్షాలు లేకపోవడంతో గొట్టాబ్యారేజీలో ప్రస్తుతం 500 క్యూసెక్కులకే పరిమితమైందన్నారు. దీనివల్ల రబీ సీజన్‌లో పండించే వరి పంటలకు వంశధార ప్రధాన ఎడమ కాలువ ద్వారా సాగునీరం దించలేమని స్పష్టం చేశారు. వచ్చే ఏడాది ఖరీఫ్‌ను దృష్టిలో ఉంచుకొని కాలువ మరమ్మతుకు మంత్రి అచ్చెన్నాయుడు నిధులు మంజూరు చే యడంతో ఈ వేసవిలో పలు చోట్ల ఓటీలు మరమ్మ తులు చేపడతామన్నారు. వంశధార ప్రధాన ఎడమ కాలువ పరిధి 55వ కిలోమీటరు నుంచి శివారు ప్రాంతమైన కిడిసింగి వరకు 104.250 కిలోమీటర్ వరకు, పెద్దసాన ఎస్కేప్, పోలవరం యాక్యులేటర్, ప్రొటెక్షన్ వాల్, మదనగోపాలసాగరం ఔట్‌లెట్ రంధ్రాలు, 46ఆర్ తిర్లంగి, 49ఆర్ బన్నువాడ, 55ఆర్ కాపు తెంబూరు, 57ఆర్ పెంటూరు, 58ఆర్ నరేంద్రపురం, 60ఆర్ కణితివూరు, 61ఆర్ హరిదాసుపురం, 65ఆర్ కేసుపురం, 67, 68ఆర్‌లు ఈదుపురం తదితర ప్రాంతాల్లో ఓటీలకు ఈ వేసవిలో మరమ్మతులు చే యించాల్సి ఉందన్నారు. ఈ పనులకు టెండర్లను పిలి చామన్నారు. ప్రస్తుతం వంశధార ప్రధాన ఎడమ కాలువ ద్వారా 212 క్యూసెక్కుల నీరు మాత్రమే వస్తుందని, కేవలం చెరువు ల్లోకి మాత్రమేనని గుర్తుచేశారు. రైతులు ఈ విషయాన్ని గమనించి రబీలో వరిపంట వేయవద్దని సూచించారు.

వైభవంగా ఆదిత్యుని కల్యాణం



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

అరసవల్లి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామివారికి మంగళవారం వైభవంగా కల్యాణం నిర్వహించారు. కార్తీక బహుళ ఏకాదశిని పురస్కరించుకుని ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో అనివెట్టి మండపంలో వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ స్వామివారి కల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ ఈవో వై.భద్రాజీ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో ఇప్పిలి సాందీపశర్మ తదితరులు పాల్గొన్నారు.

ఆయుర్వేదంతో ఆరోగ్యకర సమాజం

● జిల్లా ఆయుష్ కో ఆర్డినేటర్ జగదీష్



ర్యాలీ నిర్వహిస్తున్న ఆయూష్ సిబ్బంది

అరసవల్లి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి):ఆయుర్వేదం వైద్యంతో ఆరోగ్యకర సమాజ నిర్మాణమే లక్ష్యమని జిల్లా ఆయుష్ కోఆర్డినేటర్ జగదీష్ తెలిపారు. మంగళవారం శ్రీకాకుళంలోని జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి కార్యాలయం నుంచి ఏడు రోడ్ల కూడలి వరకు దేశ్‌కా ప్రకృతి పరిక్షాన్ అభియాన్ జాతీయ ఆరోగ్య అవగాహన కార్యక్రమంలో భాగంగా ఆయుష్ విభాగం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఉప-కోఆర్డినేటర్ వి.సీతామహాలక్ష్మి, ఉత్తరరాజు, శేఖరరావు పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

● జిల్లా వ్యవసాయాధికారి త్రినాథస్వామి

అరసవల్లి,నవంబరు 26(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అల్పపీడనం ప్రభావంతో ఈనెల 29 నుంచి వర్షాలు కురిసే అవకాశముండడంతో రైతులు అప్రమత్తంగా ఉండాలని, ధాన్యాన్ని జాగ్రత్త చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి త్రినాథస్వామి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వరికోతలు చేయనివారు వాయిదా వేసుకోవాలని, కోతలు జరిగితే కుప్పలు వేసుకుని, టార్పాలిన్లు కప్పి ధాన్యం జాగ్రత్త చేసుకోవాలని కోరారు. నూర్పులు జరిగి కళ్లంలో ఉన్న ధాన్యాన్ని బస్తాల్లో నింపి ఇంటివద్ద, దగ్గర్లో ఉన్న మిలుల వద్దగానీ భద్రపరచుకోవాలని సూచించారు. షెడ్యూలింగ్ లేకపోయినా ధాన్యాన్ని మిల్లులకు తరలించేందుకు కలెక్టర్ ఆదేశాలు జారీచేశారని తెలిపారు.

●ఇచ్ఛాపురం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): రాబోయే నాలుగు రోజుల్లో అల్పపీడనం బలపడి భారీ వర్షాలు కురిసే అవకాశముందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలియజేయడంతో రైతులు అప్రమత్తంగాఉండాలని ఏవో టి.భార్గవి ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు వరి పంట కోతలు ఈనెల 30 తర్వాత చేయాలని, ఒకవేళ ఎవరైనా పంట కోస్తే కుప్పలుగా వేసి వాటిపై టార్పలిన్లు కప్పాలని పేర్కొన్నారు.

●జి.సిగడాం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏవో ఎర్రా శారద మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మూడు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో వరి కోతలను నిలిపివేయాలని కోరారు.

నిరంకుశ విధానాలు విడనాడాలి

ఇచ్ఛాపురం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం నిరంకుశ విధానాలను విడనాడాలని ఎమ్మెల్సీ నర్తు రామారావు కోరారు. మంగళవారం ఇచ్ఛాపురం పాతబస్టాండ్ జంక్షన్ రాజ్యాంగ దినోత్సవం పురస్కరించుకుని డాక్టర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బోర పుష్ప, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు పాల్గొన్నారు

ఆమదాలవలసలో డాగ్ స్క్వాడ్ తనిఖీలు

ఆమదాలవలస, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి):పట్టణంలోని పలు ప్రాంతాల్లో గంజాయి,మాదకద్రవ్యాలనివారణలో భాగంగా ఎస్ఐకె.వెంకటేష్ ఆధ్వర్యంలో మంగళవారం డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీ నిర్వహించారు. రైల్వేస్టేషన్, పోలీస్‌స్టేషన్ జంక్షన్, జూనియర్ కళాశాల పరిసర ప్రాంతాల్లో గల దుకాణాల్లో క్షుణ్ణంగా తనిఖీచేశారు.

రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన

ఇచ్ఛాపురం,నవంబరు 26(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై యువత అప్రమత్తంగా ఉండాలని సీఐ మీసాల చిన్నమనాయుడు తెలిపారు.మంగళవారం ఇచ్ఛాపురంలోని బాలుర ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు యాంటీడ్రగ్స్, రోడ్డు ప్రమాదాలు, సైబర్‌నేరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పట్టణ ఎస్ఐ చిన్నమనాయుడు పాల్గొన్నారు. అలాగే ద్విచక్రవాహనచోదకులు రోడ్డు ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని రూరల్ ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు. బెనుగానిపేటలో గ్రామస్థులతో సమావేశం నిర్వహించారు.

●గార, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రజలు డిజిటల్ అరెస్టుపై అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ ఆర్.జనార్దన్ తెలిపారు. పూసర్లపాడులో సంకల్పం కార్యక్రమంలో భాగంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ సైబర్‌నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని కోరారు.

బాల్యవివాహాల నిర్మూలనపై..

జి.సిగడాం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి):జి.సిగడాం ఆదర్శ పాఠశాలలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాల్యవివాహాల నిర్మూలనపై అవగాహనకల్పించారు.కార్యక్రమంలో మండల ప్రత్యేక ఆహ్వానితుడు మీసాల వెంకటరమణ, ప్రిన్సిపాల్ అన్నాశామ్యూల్ లెంక, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మి, ఐసీపీఎస్ సోషల్ వర్కర్ జనార్దన పాల్గొన్నారు.

వేమన రెడ్డిక గ్రూప్ కార్యవర్గం ఎన్నిక

ఇచ్ఛాపురం,నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురంలోని బెల్లుపడ జామి ఎల్లమ్మ ఆలయం వద్ద వేమన రెడ్డిక గ్రూప్ సంఘం కార్యవర్గం ఎన్నిక మంగళవారం జరిగింది. అధ్యక్షుడిగా సిల్లా మేఘనాథం, ఉపాధ్యక్షుడిగా రంగాల శ్రీనివాసరెడ్డి, కార్యదర్శిగా దక్కత విశ్వనాథంరెడ్డి, ట్రెజరర్‌గా ఆశిగౌరీ శంకరరెడ్డి,అడ్వైజర్లగా ఆశి లీలారాణి, బుద్దాల నిర్మలారెడ్డి, రెయ్యి జానికిరావు ఎన్నికయ్యారు.

మహిళల ఆరోగ్య రక్షణే లక్ష్యం

ఆమదాలవలస, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి):మహిళల ఆరోగ్య రక్షణే ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ జిల్లా యాదవ సంఘం కార్యదర్శి నాగళ్ల మురళీధర్‌యాదవ్ తెలిపారు. మంగళవారం మునిసిపాలిటీలోని పదోవార్డు మెట్టక్కివలసలో ఐసీడీఎస్ గ్రూప్ సభ్యులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఏడోవార్డు చింతాడలో టీడీపీ బీసీసెల్ రాష్ట్రకార్యదర్శి బోర గోవిందరావు ఆధ్వర్యంలో అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం మేనేజర్ సుమన్, జిల్లా కొనుగోలు మేనేజర్ కృష్ణారావు, ఎం.ధనలక్ష్మి పాల్గొన్నారు.

మహిళలపై దాడులు అరికట్టాలి

లావేరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గురుగుబిల్లిలో మహిళలపై దాడులు అరికట్టాలని కోరుతూ మంగళవారం మహిళాసంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వెలుగు సీసీ నేతల రమేష్ గృహహింస చట్టం, బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలు, అత్యాచార నిరోధక చట్టం గురించి వివరించారు. కార్యక్రమంలో సీఎఫ్ మల్లేశ్వరి పాల్గొన్నారు.

వర్సిటీ క్రీడాకారిణికి వెయిట్ లిఫ్టింగ్‌లో బంగారు పతకం

ఎచ్చెర్ల, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ క్రీడాకారిణి దూబ హేమశ్రీ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో బంగారు పతకం సాధించింది. గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీలోని మంగళవారం ప్రారంభమైన సౌత్‌వెస్ట్ మహిళల వెయిట్‌లిఫ్టింగ్ పోటీల 55 కిలోల విభాగంలో శ్రీకాకుళానికి చెందిన హేమశ్రీ బీఆర్‌ఏయూ తరఫున పాల్గొని సత్తాచాటింది. వెయిట్‌లిఫ్టింగ్‌లో యూనివర్సిటీకి బంగారు పతకం రావడం ఇదేప్రథమం విశేషం. ఈ పోటీలకు మేనేజర్ వర్సిటీ పీడీ ఎం.శ్రీనివాసరావు, శాప్ ప్రతినిధి ఐ.అప్పన్న కోచ్‌గా వ్యవహరించారు. నాగార్జున యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ గంగాధర్ చేతులమీదుగా హేమశ్రీ బంగారు పతకం అందుకుంది. ఈ మేరకు హేమశ్రీని బీఆర్‌ఏయూ వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని అభినందించారు.

పెన్‌కాక్ సిలాట్‌లో సత్తాచాటిన రణస్థలం విద్యార్థి

రణస్థలం,నవంబరు 26(ఆంధ్రజ్యోతి):రణస్థలం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుతున్న మామిడి పవన్ సాయి జమ్ముకాశ్మీర్‌లో ఈనెల 21 నుంచి 24 వరకు జరిగిన 12వ ఆల్ ఇండియా పెన్‌కాక్ సిలాట్ చాంపియన్ షిప్ పోటీల్లో సత్తాచాటాడు. 70-75 కిలోల విభాగంలో తృతీయ స్థానాన్ని కైవసం చేసుకున్నాడు. ఈ మేరకు పవన్ సాయిని ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు.

తైక్వాండో పోటీలకు బాలుడు ఎంపిక

శ్రీకాకుళం స్పోర్ట్స్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళానికి చెందిన బాలుడు జామి సాక్షిత్ ఈనెల 29 నుంచి హర్యానాలో జరగనున్న 38వ జాతీయస్థాయి సబ్ జూనియర్ పూమ్‌సే తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా కలెక్టర్ స్వప్నిల్ దినకర్‌పుండ్కర్ సాక్షిత్‌కు అభినందించారు. కార్యక్రమంలో తైక్వాండో శ్రీను, సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

రిఫరీగా గౌతమ్

శ్రీకాకుళానికి చెందిన మజ్జి గౌతమ్‌ను జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు రిఫరీగా నియమిస్తూ తైక్వాండో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా కార్యదర్శి నుంచి ఉత్తర్వులు అందాయి. ఆయన శ్రీకాకుళంలో శిక్షణ ఇస్తూ ఎందరో క్రీడాకారులు రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో పతకాలను తెచ్చేందుకు కృషిచేశారు. గతంలో రాష్ట్ర, జాతీయస్థాయి పోటీలకు రిఫరీగా కూడా వ్యవహరించారు.

నిధులు లేక.. నిర్మాణం పూర్తి కాక

●వాహనచోదకులకు తప్పని అగచాట్లు ● ఇదీ పలాస-చిన్నబడాం రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి పరిస్థితి


కాశీబుగ్గ వైపు అర్థాంతరంగా నిలిచిపోయిన ఫ్లైఓవర్ బ్రిడ్జి పనులు

పలాస,నవంబరు 26(ఆంధ్రజ్యోతి):పలాస-చిన్నబడాం రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి నిధులు లేకపోవడంతో ముందుకు సాగడం లేదు. ఇక్కడ బ్రిడ్జి పనులు పూర్తికాకపోవడంతో వాహన చోదకులు, ప్రయాణికులకు అగచాట్లు తప్పడం లేదు.

పలాస-చిన్నబడాం రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జికి 2009, ఫిబ్రవరి 22న అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్యేగా ఉన్న దివంగత హనుమంతు అప్పయ్యదొర రూ.17.27 కోట్లతో నిర్మించేందుకు శంకుస్థాపన చేశారు. దీంతోపాటు శంకుస్థాపనచేసిన బెండి బ్రిడ్జిని పూర్తి చేయడంతో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రారంభించిన విషయం విదితమే. పలాస బ్రిడ్జి నిర్వాసితులకు పరిహారం చెల్లించకపోవడం, నిధుల కొరత తదితర కారణాల వల్ల పనులు ముందుకుసాగడంలేదు. ఈనేపథ్యంలో తాము నిర్మిస్తామని చెప్పి మూడేళ్ల కిందట అప్పటి మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు మళ్లీ శంకుస్థాపన చేసిన విషయం విదితమే. అయినా పనులు వైసీపీ ప్రభుత్వం హయాంలో పనులు పూర్తి చేయడానికి చర్యలు తీసుకోలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఐదు నెలల కిందట కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పనులు పూర్తవుతాయన్న ఆశతో జంట పట్టణాల ప్రజలు ఎదురు చూస్తున్నారు. ఈ వంతెన పనులు పూర్తయితే ఇక్కడ ట్రాఫిక్ సమస్య పరిష్కారం కాకపోవడంతోపాటు రైళ్ల రాకపోకల సమయంలో వేచిఉండాల్సిన కష్టాలు తీరుతాయని పలువురు వాహన చోదకులు, ప్రయాణికులు చెబుతున్నారు.

విద్యార్థులకు అపార్ కష్టాలు /

● గ్రామ సచివాలయాలు, మీసేవా కేంద్రం చుట్టూ ప్రదక్షిణ


మీసేవా కేంద్రం వద్ద అపార్ నమోదుకు పడిగాపులు కాస్తున్న విద్యార్థులు

నందిగాం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి):మండలంలోని విద్యార్థులు ఆటోమెటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ (అపార్) నమోదుకోసం అష్టకష్టాలుపడుతున్నారు. అపార్ నమోదుకు సంబంధించి ఆధార్ కార్డు, జన్మదిన ధ్రువపత్రాల్లో తేడాలు ఉండడంతో సమస్యతలెత్తుతోంది. ఈనేపథ్యంలో కొందరు విద్యార్థుల తల్లిదండ్రులు లేట్ బర్త్ సర్టిఫికెట్ కోసం తహసీల్దార్ కార్యాలయంతోపాటు గ్రామ సచివాలయాలు, నోటరీల కోసం లాయర్ల చుట్టూ ప్రదక్షణలుచేస్తున్నారు. మండలంలో 4,774 మంది విద్యార్థులకు గాను ఇప్పటివరకు 3,600 మంది అపార్ నమోదు పూర్తిచేశారు. నందిగాం, హరిదాసుపురం, కొత్తగ్రహారం, లముదాసుపురంసచివాలయాల్లో ఆధార్ నమోదుకేంద్రాలతోపాటు నందిగాం ప్రభుత్వోన్నత పాఠశాలలో ఆధార్ నమోదు కేంద్రాల్లో అపార్ నమోదుకు ఏర్పాట్లుచేశారు. అయితే అపార్ నమోదు ప్రక్రియ రోజుల తరబడి సాగుతుండడంతో విద్యార్థులతోపాటు తల్లిదండ్రులు తహసీల్దార్ కార్యాలయం, సచివాలయాలు,మీసేవా కేంద్రాల వద్ద నిరీక్షించాల్సివస్తోంది. ప్రస్తుతం వరికోతలు ముమ్మరంగాసాగుతున్న సమయంలో అపార్‌కోసం కార్యాలయాలచుట్టూ తిరగాల్సివస్తోందని తల్లిదండ్రులు వాపోతున్నారు. కాగా విద్యార్థులకు ఇబ్బందిలేకుండా ఎప్పటికప్పు డు కార్యాలయానికి వచ్చిన పత్రాలను రికార్డుచేసి ఆర్డీవో కార్యాలయానికి సమర్పిస్తున్నామని తహసీల్దార్ పి.సోమేశ్వరరావు తెలిపారు.

పని ఒత్తిడి తగ్గించండి


ఎంపీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

గార, నవంబరు 26(ఆంధ్రజ్యోతి):పని ఒత్తిడి తగ్గించాలని పంచాయతీ కార్యదర్శులు కోరారు.ఈ మేరకు ఎంపీడీవో ఎస్.రామమోహనరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పనిఒత్తిడి వల్ల అనారోగ్యం బారినపడుతున్నామని తెలిపారు.ఈవిషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి న్యాయం చేయాలని కోరారు.

మూడురోజుల్లోనే ధాన్యం డబ్బులు

● ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్


సింధువాడలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న రవికుమార్

సరుబుజ్జిలి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రైతు ధాన్యం అమ్మిన మూడు రోజుల్లోనే డబ్బులు చెల్లించేలా చర్యలు చేపట్టినట్లు ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ తెలిపారు. మంగళవారం సింధువాడ గ్రామ సచివాలయ పరిధిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు.కార్యక్రమంలో వ్యవసాయశాఖఏడీ బి.రాజగోపాలరావు, ఎంపీడీవో ఎం.పావని, డీసీఎంఎస్ బీఎం జగ్గునాయుడు, తహసీల్దార్ ఎల్.మధుసూదన్, టి.శ్రీనివాస్, గోవింద వెంకట శివానందమూర్తి, సర్పంచ్‌లు గోవింద కామేశ్వరి, తర్లాడ ఈశ్వరరావు, పల్లి సురేష్ పాల్గొన్నారు.

రాయితీపై చేప పిల్లల పంపిణీ


సోంపేట/కవిటి: చేపపిల్లలను పంపిణీ చేస్తున్న అశోక్

కవిటి/సోంపేట, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): సోంపేట, కంచిలి మండలాలల్లో గల గిరిజన మత్స్యకారులకు ఐటీడీఏ సబ్‌ప్లాన్ 2024-25 కింద 100శాతం రాయితీపై చేప పిల్లలను ప్రభుత్వవిప్ బెందాళం అశోక్ మంగళవారం రామయ్యపుట్టుగ అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్రకార్యదర్శి సూరాడ చంద్రమోహన్, ఈశ్వరరావు పాల్గొన్నారు.

రెడ్డిక సంఘ భవనం నిర్మించండి

ఇచ్ఛాపురం,నవంబరు 26(ఆంధ్రజ్యోతి): వేమన రెడ్డిక గ్రూప్ సంఘం భవనం నిర్మాణానికిచర్యలుతీసువాలని ఆసంఘసభ్యులు కోరారు.ఈమేరకు మంగళవారం రామయ్యపుట్టుగ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ కార్యవర్గ సభ్యులు వినతిపత్రం అందజేశారు.కార్యక్రమంలో టీడీపీ బీసీ సాధికార సమితి కన్వీనర్ కొండా శంకరరెడ్డి, రెడ్డిక కుల పెద్దలు బడే దొరబాబురెడ్డి, చాట్ల లోహిదాస్‌రెడ్డి, తిప్పన కూర్మయ్యరెడ్డి, రెయ్యి కేశవరెడ్డి, కొచ్చర్ల ధనుంజయ, తిప్పన భాస్కరరెడ్డి పాల్గొన్నారు. అలాగే ప్రభుత్వ విప్‌గా బాధ్యతలు స్వీకరించిన ఎమ్మెల్యే బెందాళం అశోక్‌ను మునిసిపల్ కమిషనర్‌తో పాటు అధికారులు, మండల మహిళా సమాఖ్య, సెర్ప్ సిబ్బంది, వీఓఏలు సన్మానించారు.

సుందర శ్రీకాకుళమే ధ్యేయం: ఎమ్మెల్యే శంకర్


అరసవల్లి: డ్రైనేజీని పరిశీలిస్తున్న శంకర్

అరసవల్లి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దడమే ధ్యేయమని ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు. మంగళవారం శ్రీకాకుళంలోని పీఎన్ కాలనీలో రోడ్లు,డ్రైనేజీల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం మౌలిక వసతులను కల్పించలేదని, పలు డివిజన్లలో ఐదేళ్లగా సమస్యలు పేరుకుపోయాయని ఆరోపించారు. ప్రజలకు ఆమోదయోగ్యమైన మాస్టర్ ప్లాన్‌ను తయారుచేస్తామని తెలిపారు.

● శ్రీకాకుళం రూరల్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి):నాయీ బ్రాహ్మణులను ఆదుకునేందుకు టీడీపీ ప్రభుత్వం కృషి చేస్తోందని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు. మండలంలోని వాడాడలో జరిగిన నాయీ బ్రాహ్మణుల వనభోజన కార్యక్రమంలో మాట్లాడుతూ నాయీబ్రాహ్మణలకు సంక్షేమ పథకాలు అందజేసి వారు ఆర్థిక, సామాజిక, రాజకీయంగా నిలదొక్కుకునేలా అవకాశాలు కల్పిస్తామని తెలిపారు.

టీడీపీ నాయకుల కుటుంబాలకు పరామర్శ


ఎచ్చెర్ల: రాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు

ఎచ్చెర్ల, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ గట్టెం రాములు ఇటీవల మృతిచెందడంతో అరిణాం అక్కివలసలోని ఆయన కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు మంగళవారం పరామర్శించారు. రాములు కుమారులు గట్టెం శివరామ్, హరిలను ఓదార్చారు. కార్యక్రమంలో కూటమి నేతలు లంక శ్యామలరావు, పిన్నింటి బావాజీనాయుడు, మజ్జి వెంకటరమణ, గట్టెం రమేష్, పుణ్యపు శంకర్ పాల్గొన్నారు.

●జి.సిగడాం,నవంబరు 26(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న చెట్టుపొదిలాం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు, ఏఎంసీ మాజీ ఉపాధ్యక్షుడు భూపతి శ్రీరామ్మూర్తి శ్రీకాకుళంలోచికిత్స పొందుతుండడంతో ఎమ్మెల్యే ఎన్ఈఆర్ పరామర్శించారు. ఆయన వెంట జి.సిగడాం, రణస్థలం నాయకులు కుమరాపు రవికుమర్, పిన్నింటి భనోజీనాయుడు, టంకాల మౌళీశ్వరరావు, నక్క మురళీధర్, లంక శ్యామ్ ఉన్నారు.

పర్యవేక్షణ లేక.. అగచాట్లు

● ఇచ్ఛాపురంలో ట్రాఫిక్ సమస్య

ఇచ్ఛాపురం, నవంబరు26(ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురంలో భారీ వాహనాల రాకపోకలపై నియంత్రణకు పర్యవేక్షణ లేకపోవడంతో ట్రాఫిక్ కష్టాలు తప్పడం లేదు. పట్టణం ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఏడు గంటల వరకు రద్దీగా ఉంటోంది. ఆ సమయంలోఅంతర్గత రోడ్లపై రాకపోకలకు పోలీసుల విధించిన ఆంక్షలను సైతం వాహన నిర్వాహకులు బేఖాతర్ చేస్తున్నారు. దీంతో నిత్యం ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది.

మార్కెట్ జంక్షన్-బీకేపేట రోడ్డులో బ్యాంకులతోపాటు పలు వ్యాపార సంస్థలు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు ఉండడంతో ప్రతిరోజూ విద్యార్థులు, వ్యాపారులు, కూలీలు, ఉద్యోగులు రాకపోకలతో నిత్యం రద్దీగా ఉంటోంది. ఈ రహదారిలోనే ఈ మార్గం గుండానే పలు గ్రామా లకు ఆటోలు, ద్విచక్రవాహనాల్లో రాకపోకలు సాగిస్తున్నారు. పోలీసుల నిబంధనలను సైతం బేఖాతర్‌చేస్తున్నా ట్రాఫిక్ పోలీస్ చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. బీకేపేట-కొళిగాం రోడ్డులో సిమెంట్, ఐరన్ గోడాముల వద్ద సిమెంట్, ఐరన్ లోడింగ్ అన్‌లోడింగ్ చేస్తుండడంతో నిత్యంట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. ఇప్పటికైనా పోలీస్ యంత్రాంగం ట్రాఫిక్ నియంత్రణకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని పట్టణవాసులు కోరుతున్నారు.


బీకేపేట-కొళిగాం రోడ్డులో భారీ వాహనాల రాకతో స్తంభించిన ట్రాఫిక్

రాజ్యాంగాన్ని గౌరవించాలి

●జిల్లా వ్యాప్తంగా రాజ్యాంగ దినోత్సవం


ఎచ్చెర్ల: వర్సిటీలో ప్రతిజ్ఞ చేస్తున్న వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని తదితరులు

రాజ్యాంగాన్ని గౌరవించడం కులమతాలకు అతీతంగా భారతీయులందరి బాధ్యతఅని వక్తలు తెలిపారు. మంగళవారం జిల్లా వ్యాప్తంగా రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు.ఈ సందర్భంగా అంబేడ్కర్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలువేసి నివాళులర్పించారు. వక్తలు రాజ్యాంగం ఆవశ్యకతను వివరించారు.అనంతరం రాజ్యాంగ ప్రవేశికను వివరిస్తూ సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు.

(ఆంధ్రజ్యోతి బృందం)


శ్రీకాకుళంక్రైం: అంబేద్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

ఆంధ్రజ్యోతికి 22వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

మళ్ల అబ్బాయినాయుడు, టి.డి.పి. పార్లమెంటరీ బీసీ సెల్ అధ్యక్షులు, బూరవెల్లి (గారమండలం)
మళ్ల నర్సింగరావు, మాజీ ఏ.ఎం.సి. వైస్ చైర్మన్, బూరవెల్లి, గార మండలం
మళ్ల నర్సింహమూర్తి, టి.డి.పి. నాయకులు, బూరవెల్లి (గార మండలం)
మళ్ల పద్మారావు, టి.డి.పి. నాయకులు, బూరవెల్లి (గార మండలం)

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

● కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఐక్య ఉద్యమాలు

● శ్రీకాకుళంలో సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో నిరసన



ధర్నా నిర్వహిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

అరసవల్లి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): లేబర్ కోడ్లను రద్దు చేయాలని, కార్మికులకు కనీస వేతనాలు, పీఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలని, జీడి 80 కేజీల బస్తాకు రూ.16వేల మద్దతు ధర ఇవ్వాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి వి.వేంకటేశ్వర్లు, సీఐటీయూ కార్యదర్శి పి.తేజేశ్వరరావు, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి స్రవంతి, ఎస్‌కేఎం జిల్లా కన్వీనర్ టి.ప్రకాష్, రైతుకూలీ సంఘం జిల్లా కార్యదర్శి టి.అరుణ డిమాండ్‌చేశారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వ కార్మిక, రైతు వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఐక్య ఉద్యమాలను ఉధృతంచేస్తామని తెలిపారు. మంగళవారం దేశవ్యాప్త పిలుపులో భాగంగా అఖిలపక్ష సంఘాలు, సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో శ్రీకాకుళంలోని ఆర్అండ్‌బీ బంగ్లా నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అక్కడ ధర్నా నిర్వహించి, కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కృష్ణవేణి, సురేష్, వెంకటరావు, పొందూరు చంద్రరావు, వి.రమణ, ప్రసాదరావు, రాజశేఖర్, కళ్యాణి, ఉత్తర, బలరాం, పాల్గొన్నారు.

ర్యాంగింగ్‌కు పాల్పడితే భవిష్యత్ శూన్యం

గుజరాతీపేట,నవంబరు 26(ఆంధ్రజ్యోతి):ర్యాగింగ్‌కుపాల్పడే విద్యార్థుల భవిష్యత్ శూన్యమవుతుందని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు తెలిపారు. శ్రీకాకుళంలోని ప్రభుత్వ మహిళా కళాశాలలో వరకట్నం నివారణ, యాంటీర్యాగింగ్‌పై అవగాహనసదస్సు నిర్వహించారు. కార్యక్రమం లో ప్యానల్ అడ్వకేట్ జి.ఇందిరా ప్రసాద్, ప్రిన్సిపాల్ సూర్యచంద్రరావు పాల్గొన్నారు.

ఘనంగా సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం

శ్రీకాకుళం కల్చరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలోని ఉమాజీవేశ్వరాలయంలో మహా కుంభాభిషేకం పురస్కరించుకుని మంగళవారం మండప పూజలు, సూర్య నమస్కారాలు, చండీ రుద్ర యాగాలు నిర్వహించారు. అనంతరంవల్లిదేవసేన సుబ్రహ్మణ్య స్వామి కల్యాణోత్సవం ఘనంగా జరిపించారు. కార్యక్రమంలో మండేల అనీల్ శర్మ, రంగాబట్ల శ్రీను, రవీంద్ర యాగాటి ప్రసాద్, బస్వా రవి, చిత్రాడ గాంధీ, చంద్రశేఖర్, శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.







ABN ఆంధ్రజ్యోతి
ఏబీఎన్- ఆంధ్రజ్యోతిలో మరిన్ని క్రైం వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి
మీ స్మార్ట్‌ఫోన్‌లో యాప్ స్టోర్ నుంచి క్యూఆర్ కోడ్ స్కానర్ యాప్‌ను డౌన్ లోడ్ చేసుకుంటే, మీ ఫోన్ కెమెరా ద్వారా ఈ కోడ్‌ను స్కాన్ చేయవచ్చు.

క్రైం కార్నర్

ఐదు కేజీల గంజాయితో ఒకరి అరెస్ట్

ఇచ్ఛాపురం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఒడిశాలో కొనుగోలు చేసిన గంజాయిని ఇచ్ఛాపురం రైల్వే స్టేషన్ నుంచి ముంబై తరలించేందుకు సిద్ధమవుతున్న ఓ వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. మంగళ వారం సీఐ మీసాల చిన్నమనాయుడు విలేకరులతో మాట్లాడారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నా యి.. ఉత్తర ప్రదేశ్‌కు చెందిన విశాల్‌యాదవ్ ఒడిశాలోని కందమాల్ జిల్లా ఫుల్బానిలో 5.170 గ్రాముల గంజాయి కొనుగోలు చేశాడు. కోణార్క్ ఎక్స్‌ప్రెస్ రైలులో ముంబై తరలించేందుకు మంగళవారం సాయంత్రం ఇచ్ఛాపురం రైల్వే స్టేషన్‌కు చేరుకున్నాడు. స్టేషన్‌లో సంచరిస్తున్న అతడిపై పోలీస్ సిబ్బందికి అనుమానం వచ్చింది. దీంతో ఆయన వద్ద ఉన్న బ్యాగ్‌ను తనిఖీ చేయగా గంజాయి పట్టుబడింది. ఆ గంజాయి సీజ్ చేయడంతో పాటు నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. కార్యక్రమంలో పట్టణ ఎస్ఐ చిన్నమనాయుడు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం

కోటబొమ్మాళి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కమలనాథపురానికి చెందిన వివాహిత ఈనెల 22 నుంచి కనిపించడం లేదని ఆమె భర్త కరిగి నవీన్ మంగళ వారం ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ వి.సత్యనారాయణ తెలిపారు. 22న బహిర్భూమికి వెళ్లి వస్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదని ఎప్పటికీ రాక పోవడంతో పరిసర ప్రాంతాల్లో, బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభ్యం కాలేదన్నారు. ఈ మేరకు భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మెనూలో లోపాలుంటే చర్యలు తప్పవు

- ఐటీడీఏ ఏపీవో చిన్నబాబు


బుడంబోలో భోజనాలను పరిశీలిస్తున్న ఏపీవో చిట్టిబాబు

హరిపురం/మందస, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు అందించే మెనూ అమలులో లోపాలుంటే బాధ్యులపై చర్యలు తప్ప వని సీతంపేట ఐటీడీఏ ఏపీవో జి.చిన్నబాబు హెచ్చరించారు. బుడంబో, కిల్లోయి ఆశ్రమ పాఠశాలలను మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పాఠ్యాంశాలపై పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. పదోతరగతి ఫలితా ల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. భోజనాలను పరిశీలించారు. బుడంబోలో మెను ప్రకారం భోజనాలు పెట్టడం లేదని, ఆహారపదార్థాలు రుచికరంగా లేవంటూ హెచ్ఎం, వార్డెన్‌లకు మెమోలు జారీ చేశారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, మరుగుదొడ్ల విషయంలో విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు.

జోనల్‌లో పలాస నెంబర్ వన్‌గా ఉండాలి

- ఎల్ఐసీ ఎండీ సర్పాల్ భానో


నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న సర్పాల్ భానో

కాశీబుగ్గ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): జోనల్ పరిధి లో పలాస బ్రాంచి నెంబర్ వన్‌గా నిలవాలని ఎస్ఐసీ మేనేజింగ్ డైరెక్టర్ (ముంబై) సర్పాల్ భానో అన్నారు. కాశీ బుగ్గలో నూతనంగా నిర్మించిన కార్యాలయం, సిబ్బంది క్వార్టర్స్‌ను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దేశంలో 8 జోనల్ కార్యాలయాలున్నాయని, సౌత్ సెంట్రల్ పరిధిలోని ఏపీ, తెలంగాణా, కర్ణాటక రాష్ట్రాల్లో సుమారు 300 బ్రాంచిలతో సేవలందిస్తున్నామన్నారు. పలాసలో 1983లో బ్రాంచి ప్రారంభిం చామని, నేటికీ లాభాల బాటలో నడుస్తోందన్నారు. గత ఏడాది రూ.32 కోట్ల వ్యాపారం చేయ గా ఈ ఏడాది రూ.45 కోట్లు లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఎల్ఐసీతో ప్రజలకు భరోసా కలుగుతుందని, ఎల్ఐసీ పాలసీలపై ఎటువంటి అపోహలు పడవద్దన్నారు. కార్యక్రమంలో హైదరాబాద్ సౌత్ సెంట్రల్ జోనల్ మేనేజర్ పునిత్‌కుమార్, చీఫ్ ఇంజనీర్ ఆర్ఎల్ఎస్ స్వామి, విశాఖ డివిజనల్ మేనేజర్ శారత ప్రసాద్ దాస్, మార్కెటింగ్ మేనేజర్ రాజశేఖర్, పలాస బ్రాంచి మేనేజర్ టి.బిసాయి తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిత్వ హననానికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోండి


పోలీసులకు ఫిర్యాదు అందిస్తున్న టీడీపీ నాయకులు

పలాస, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో తమ పార్టీనేతలు, అప్పటి ప్రతిపక్ష నాయకుల వ్యక్తిత్వ హననానికి పాల్పడుతూ వికృతంగా పోస్టింగ్‌లు పెట్టిన వారిపైచర్యలు తీసుకో వాలని టీడీపీ నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం కాశీబుగ్గ పోలీసులకు వారు ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా పార్టీ రాష్ట్ర కార్యదర్శి పీరుకట్ల విఠల్‌రావు మాట్లాడుతూ.. అప్పటి ప్రతిపక్ష నాయకులను టార్గెట్ చేస్తూ సామాజిక మాధ్యమాల్లో టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన నేత పవన్ కల్యాణ్, నారా లోకేష్, గౌతు శిరీష తదితరుల కుటుంబాలపై వైసీపీ హయాంలో ఆ పార్టీ నేతలు సోషల్ మీడియా వేదికగా అత్యంత పాశవికంగా పోస్టింగ్‌లు పెట్టి వారి వ్యక్తిత్వ హననానికి పాల్ప డ్డారని ఆరోపించారు. ఈ విష సంస్కృతికి స్వస్తిపలికేందుకు బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. కాశీబుగ్గ పోలీసులు, డీఎస్పీ కార్యాలయాలకు ఫిర్యాదులు అందించారు. కార్యక్ర మంలో ఏపీ టీపీసీ చైర్మన్ వజ్జ బాబూరావు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు బడ్డ నాగ రాజు, కార్యదర్శి సప్ప నవీన్, బిసిసెల్ రాష్ట్ర కార్యదర్శి లొడగల కామేశ్వరరావు యాదవ్, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి గాలి కృష్ణారావు, గురిటి సూర్యనారాయణ, జోగ మల్లి, డొక్కరి శంకర్, మల్లా శ్రీనివాస్, దడియాల నర్సింహులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీముఖలింగేశ్వరుని గ్రామోత్సవం



జలుమూరు, నవంబరు 26: (ఆంధ్రజ్యోతి): శ్రీముఖలింగంలోని శ్రీముఖలింగేశ్వరస్వామి గ్రామోత్సవం మంగళవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. కార్తీకమాసం బహుళ ఏకాదశి పర్వదినం సందర్భంగా ఉదయం నుంచి ప్రత్యేకపూజలు, అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం స్వామి ఉత్సవ మూర్తులను పల్లకిలో వేంచేపు చేసి తిరువీధి చేపట్టారు. పలువురు భక్తులు హారతులిచ్చి స్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఈవో పి.ప్రభాకరరావు, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు. ●శ్రీముఖలింగేశ్వర స్వామికి కార్తీకమాసంలో రూ.8,22,389 ఆదాయం వచ్చినట్లు ఈవో పి.ప్రభాకరరావు తెలిపారు. మంగళవారం హుండీలను ఆమదాలవలస ఈవో తమ్మినేని రవి ఆధ్వర్యంలో సిబ్బంది లెక్కించారు. ప్రత్యేక దర్శనం టిక్కెట్ ద్వారా రూ.2,45,600, స్థల పురాణం పుస్తకాల విక్రయం ద్వారా రూ.3220, స్వామి ఫొటోల ద్వారా రూ.2200, హుండీ ఆదాయం రూ.5,67,869 ఆదాయం వచ్చినట్లు తెలిపారు.

దివ్యాంగులకు 'సదరం' కష్టాలు

- కనీసం కూర్చునేందుకు బెంచీలు లేవు
- ఇదీ జిల్లా కేంద్ర ఆసుపత్రి తీరు


జిల్లా కేంద్ర ఆసుపత్రిలో నేలపై కూర్చున్న దివ్యాంగులు

టెక్కలి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్ర ఆసుపత్రిలో దివ్యాంగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ ఆసుపత్రిలో నిర్వహించే సదరం క్యాంపులో సర్టిఫికేట్ల నిమిత్తం ప్రతి మంగళ, శుక్ర వారాల్లో దివ్యాంగులు పెద్ద సంఖ్యలో వస్తారు. వివిధ వీరిని ఆర్థోపెడిక్, దృష్టిలోపం విభాగాలకు సంబం ధించి వైద్యులు తనిఖీ చేసి సదరం సర్టిఫికేట్లు ఇస్తారు. అయితే జిల్లా నలుమూలల నుంచి వచ్చే దివ్యాంగులకు సరైన సదుపాయాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆసుపత్రికి వచ్చే దివ్యాం గులు కూర్చునేందుకు బెంచాల సదుపాయం లేక నేలపైనే గంటల తరబడి కూర్చొని తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. అలాగే కనీసం తాగునీటి సౌకర్యం కూడా లేదని వారు వాపోతున్నారు. ఈ విషయమై జిల్లా కేంద్ర ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి.సూర్యారావు వద్ద 'ఆంధ్రజ్యోతి' ప్రస్తావించగా సద రం కోసం వచ్చే వ్యక్తులకు అవసరమైన బెంచీలు ఏర్పాటు చేశామని, ఆ బెంచీలు ఖాళీగా ఉన్నాయని, ఎవరైనా ఇతర విభాగాల వారు తీసుకుపోయారేమోనన్నారు.

ఓపీ సేవలు మెరుగుపరచాలి

నరసన్నపేట, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలు అందేలా ఉర్లాం పీహెచ్‌సీలో ఓపీ సేవలను మెరుగుపరచాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి సూచించారు. మంగళవారం పీహెచ్‌సీ సలహా కమిటీ సమావేశం నిర్వహించారు. ఆసుపత్రి పరిసరాలను పరిశీలించారు. పీహెచ్‌సీకు కావాల్సిన మౌలిక సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. వైద్యసిబ్బంది సమయ పాలన పాటించాలని, సాయంత్రం వరకు విధులు నిర్వహించాలని సూచించారు. కమిటీ సభ్యులు, మాజీ సర్పంచ్ జల్లు చంద్రమౌళి, వైద్యులు గొలివి సుజాత, అరవింద్ పాల్గొన్నారు.

ఫార్మసీ అధికారుల పోస్టుల మంజూరుపై హర్షం

పలాస, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): పలాస ప్రభుత్వ కిడ్నీ ఆసుపత్రి, పరిశోధన కేంద్రానికి రెండు ఫార్మసీ అధికారుల పోస్టులను మంజూరు చేయడంపై ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.గోపాల్ ఒక ప్రకటనలో హర్షం వ్యక్తంచేశారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఇటీవల అసెంబ్లీ సమావేశాల ముందు ఫార్మ సీ అధికారుల కొరత సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లగా ఆమె శాసనసభలో ప్రస్తావించారని, దీనిపై వైద్య ఆరోగ్య శాఖామంత్రి స్పందించి రెండు పోస్టులు మంజూరు చేశారన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి సంఘం తరపున కృతజ్ఞతలు తెలిపారు.

రాష్ట్రస్థాయి జూడో పోటీల్లో ప్రతిభ

టెక్కలి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా రేణిగుంటలో ఈనెల 23 నుంచి 25 వరకు జరిగిన 68వ రాష్ట్రస్థాయి జూడో పోటీల్లో పోలవరం జడ్పీ ఉన్నతపాఠశాల విద్యార్థులు కావ్య, నవీన్ ప్రతిభ కనబరిచారు. 50కేజీల విభాగంలో పాల్గొని కాంస్య పతకాలు సాధించారని వ్యాయామ ఉపాధ్యాయులు జగదీశ్వరరావు తెలిపారు. వీరిని హెచ్ఎం విలియమ్స్, ఉపాధ్యాయులు అభినందించారు.

కార్యకర్తలకు 'కలమట' పరామర్శ

మెళియాపుట్టినవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మెళియాపుట్టి, జలగలింగుపురం, పట్టుపురం తదితర గ్రామాల్లో అనారోగ్యంతో బాధపడుతున్న టీడీపీ కార్యకర్తలను ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కలమట వెంకటరమణమూర్తి మంగళవారం పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకుని త్వరితగతిన కోలుకోవలని ఆకాంక్షించారు. ఆయనతో పాటు పార్టీ మండల అధ్యక్షుడు బాస్కర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి యు.వసంత్ తదితరులున్నారు.

మహిళలపై గౌరవంతో మెలగాలి

వజ్రపుకొత్తూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మహిళలపై గౌరవంగా మెలగాలని పలువురు అధికారులు అన్నారు. మంగళ వారం ఎంపీడీవో కార్యాలయంలో కిశోర్ వికాశ్ టాక్స్‌పై అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో కాశీబుగ్గ ఐసీడీఎస్ పీవో కె.పార్వతి , ఎంపీడీవో రమేష్ నాయుడు, కో ఆర్డినేటర్ సీతారాం, సూపర్ వైజర్లు యు.లత, ధనలక్ష్మి, జయలక్ష్మి పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

జలుమూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలులో నాణ్యతా ప్రమాణాలు పాటించా లని చల్లవానిపేట సొసైటీ ప్రత్యేకాధికారి అడపా శ్యామలరావు అన్నారు. మర్రివలస, నగిరికటకం, సుబ్రమణ్యపురం, జలుమూరు, జోనంకి, లింగాలవలస, టెక్కలిపాడు రైతు సేవా కేంద్రాలను మంగళ వారం పరిశీలించారు. సిబ్బంది రైతు కల్లం వద్దకు పోయి ధాన్యం నాణ్యత పరిశీలించి కొనుగోలు చేయాలన్నారు. కార్యక్రమంలో సీఈవో వాన వేణుగోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన సేవలే లక్ష్యం

పాతపట్నం నవంబరు 26(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన సేవలే లక్ష్యమని కెనరా బ్యాంక్ జనరల్ మేనేజర్ విజయ లక్ష్మి అన్నారు. స్థానిక బలరాంనగర్ సమీపంలో నూతన బ్రాంచిని మంగళవారం ప్రారంభించారు. కెనరాబ్యాంక్ సేవలు విస్తృత పరిచేందుకు కొత్తగా బ్రాంచిలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. బ్యాంకు సేవలను వినియోగించుకోవాలని కోరారు.

మామపై కోడలి ఫిర్యాదు

కోటబొమ్మాళి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రకాశనగర్ కాలనీకి చెందిన జీరు భాస్కరరావు తనపై అభ్యకరంగా వ్యవహరిస్తున్నాడని అతని కోడలు రజిని ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ వి.సత్యనారాయణ తెలిపారు. ఢిల్లేశ్వరావుతో తనకు వివాహమైందని, కొంత కాలంగా మామ అసభ్యకరంగా ప్రవర్తిసున్నాడని ఆ ఫిర్యాదులో పేర్కొందని, కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బెల్టుషాపులపై చర్యలు

పలాస,నవంబరు 26(ఆంధ్రజ్యోతి): బెలుషాపులు నిర్వహించకుండా అధికారులు ప్రత్యేక దృష్టిసారించాలని ప్రొహిబిషన్, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి ఆదేశించారు. పలాస స్టేషన్‌ను మంగళవారం సందర్శిం చారు. వైన్‌షాపుల్లో ఎంఆర్‌పీ రేట్లకే అమ్మేలా చూడాలని, గ్రామాల్లో సారా, బెల్టుషాపుల నిర్వహణ ఎక్కడైనా ఉంటే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

పక్కా ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం కృషి

- మంత్రి అచ్చెన్నాయుడు


అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

కోటబొమ్మాళి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఇల్లు లేని నిరుపేదలు దరఖాస్తు చేసుకోవాలని రాష్ట్ర వ్యవసాయ, పశుసంవర్థక శాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. మంగళవారం నిమ్మాడలోని తన క్యాంపు కార్యాలయంలో రోడ్లు, హౌసింగ్, నీటి పారుదల తదితర శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అర్హత ఉండి ఇప్పటి వరకు సొంత ఇల్లు లేని వారికి పక్కా గృహాలు నిర్మించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. పేదల దరఖాస్తులను పరిశీలించి ఇళ్లను మంజూరు చేయాలని అధికారులకు సూచించారు. 2014- 2019 మధ్య ఇళ్లు మంజూరై ఆన్‌లైన్‌లో జాబితాలో పేరు లేకుంటే వాటిని వెంటనే పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలన్నారు. టెక్కలిలో ఆదర్శ కాలనీ నిర్మాణానికి సంకల్పించామని.. అన్ని వసతులతో దీనిని ఏర్పాటు చేస్తామన్నారు. టెక్కలి నియో జకవర్గంలో అభివృద్ధికి అన్ని శాఖల అధికారులు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ప్రతి రైతుకి సాగునీరం దించడమే ప్రభుత్వం లక్ష్యమని ఆ దిశగా ప్రతిపాదనలు తయారు చేయాలన్నారు. ఎత్తిపోతల పథకాలను పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో డీఈ లు, ఏఈలు, పి.సత్యనారాయణ, రవికాంత్, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

రాజ్యాంగ లక్ష్య సాధనకు కృషి చేయాలి


అంబేద్కర్ విగ్రహానికి నమస్కస్తున్న ఎమ్మెల్యే బగ్గు

నరసన్నపేట, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ లక్ష్యాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. మంగళవారం అంబేడ్కర్ విగ్రహం వద్ద రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహిం చారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ విగ్రహా నికి పూల మాల వేసి నివాళి అర్పించారు. రాజ్యాంగ మౌలిక సూత్రాల పరిరక్షణకు యువ త నడుంబిగిం చాలన్నారు. స్థానిక సివిల్ కోర్టులో న్యాయాధికారి హరిప్రియ రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. న్యాయవాదులతో ప్రతిజ్ఞ చేయించారు.


న్యాయవాదులతో ప్రమాణం చేస్తున్న న్యాయాధికారి

రాజ్యాంగ పీఠికపై ప్రమాణం

కోటబొమ్మాళి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా మంగళవారం స్థానిక సివిల్ కోర్టులో న్యాయవాదులు, సిబ్బందితో రాజ్యాంగ పీఠికపై న్యాయాధికారి బీఎంఆర్ ప్రసన్నలత ప్రమాణం చేయించారు. దేశ సార్వభౌమాధికారానికి, అభివృద్ధికి కృషి చేయాలన్నారు. డా.బీఆర్ అంబే డ్కర్ ఎంతో సదాశయంతో రచించిన భారతరాజ్యాంగం ఫలాలను పరిరక్షించాలన్నారు.

సకాలంలో కట్నం తేలేదని చంపేశారు

- మెజిస్టీరియల్ విచారణలో తల్లిదండ్రుల వాంగ్మూలం
- పోలీసుల అదుపులో మృతురాలి భర్త, సోదరి, తండ్రి


మృతురాలి తండ్రి సంపతిరావును విచారిస్తున్న డీఎస్పీ, తహసీల్దార్

పలాస, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కేవలం కట్నం సకాలంలో తీసుకు రాలేదనే కారణంతోనే తమ కుమార్తెను బలవంతంగా చంపి ఆత్మహత్యగా చిత్రీకరించారని తాము విశ్వసిస్తున్నామని, దీనిపై సమగ్ర విచారణ చేసి న్యాయం చేయాలని బాధితురాలి తల్లిదండ్రులు పల్లి సంపతిరావు, ధనలక్ష్మి డీఎస్పీ వి.వెంకటఅప్పారావు, విచారణాధికారి, తహసీల్దార్ టి.కల్యాణ చక్రవర్తి వద్ద వాంగ్మూలం ఇచ్చారు. సోమవారం పలాస మండలం ఈదురాపల్లిలో పైల నీరజాక్షి ఆత్మహత్యకు సంబంధించి మంగళవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో మెజిస్టీరిల్ విచారణ జరిగింది. తహసీల్దార్, డీఎస్పీల ప్రత్యేక పర్యవేక్షణ, కెమెరా రికార్డింగ్ మధ్య తల్లిదండ్రులు, బంధువులు, గ్రామస్థులతో విడివిడిగా విచారణ చేశారు. అంతకు ముందు పోలీసు, రెవెన్యూ అధికారుల బృందం గ్రామంలో ఘటన జరిగిన ఇంటిని పరిశీలించి ఆనవాళ్లను సేకరించింది. అనంతరం విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా మృతురాలి తల్లిదండ్రులు మాట్లాడుతూ.. పైల వినోద్‌కుమార్, తమ కుమార్తె నీరజాక్షికి ఆరు నెలల కిందట కట్న కానుకలిచ్చి వివాహం చేశామన్నారు. రూ.5 లక్షల కట్నం ఇవ్వాల్సి ఉందని, వారం రోజు ల కిందట భార్యాభర్తలు ఇంటిలో కార్తీక పౌర్ణమి ఉత్సవం చేసేందుకు ఢిల్లీ నుంచి వచ్చారన్నారు. అంతకు ముందు నుండే కట్నం వ్యవహా రాలు ప్రస్తావన చేశారని, ఇక్కడకు వచ్చిన తరువాత కూడా వేధింపులు ఎక్కువయ్యావన్నారు. నాలుగు రోజుల ముందు భార్యాభర్తలతో మాట్లాడామని, సంక్రాంతి నాటికి మిగిలిన కట్నం డబ్బులు ఇస్తామని వినోద్‌తో పాటు ఆమె సోదరి, తండ్రికి తెలిపామన్నారు. తమ కుమార్తెకు వారు పెడుతున్న ఇబ్బందులను తెలిపినా ఓర్పు వహిస్తే అన్నీ సర్దుకుంటాయని చెప్పామని, ఈ క్రమంలో సోమవారం ఉదయం నుంచి కూడా ఫోన్ చేసినా ఎత్తలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మధ్యా హ్నం 3 గంటల సమయంలో మీ కుమార్తె నీరజాక్షి ఉరిపోసుకొని మరణించిందని చెప్పడంతో తాము హతాశులయ్యామన్నారు. తాము వచ్చి మంచంపై అచేతనంగా ఉన్న కుమార్తెను చూశామన్నారు. తమ కుమార్తెను కట్నం కోసమే భర్త, సోదరి, తండ్రి చంపి ఆత్మహత్యగా చిత్రీకరించారని ఆరోపిం చారు. ఆమె మరణానికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని అభ్యర్థించారు. ఇదిలా ఉండగా మెళియాపుట్టి మండలం రకోయి గ్రామస్థులు, బాధితురాలి బంధువులు ఆసుపత్రికి వచ్చి ఆవేదన వ్యక్తం చేశారు. మృతదేహానికి పంచనామా, పోస్టుమార్టం చేసి కుటుంబీలకు అప్పగించారు. సమగ్ర దర్యాప్తు చేసి బాధితురాలి కుటుంబానికి న్యాయం చేస్తామని డీఎస్పీ వి.వెంకటఅప్పారావు, సీఐ డి.మోహన రావు తెలిపారు. ఈ కేసుకు సంబం ధించి భర్త వినోద్‌తో పాటు ఆయన తండ్రి, సోదరిలను పోలీసులు అదుపులోకి తీసుకొని ప్రశ్నిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలి

జలుమూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. చల్లవానిపేట సొసైటీలో మంగళవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దారు జె.రామరావు, ఏడీఏ రవీంద్రభారతి, ఏవో కె.సురేష్, చల్లవానిపేట సొసైటీ ప్రత్యేకాధికారి అడపా శ్యామలరావు, సీఈవో వాన వేణుగోపాలరావు, సర్పంచ్ పంచిరెడ్డి రామచంద్రరావు, టీడీపీ నేతలు వెలమల రాజేంద్రనాయుడు, దుంగ స్వామిబాబు, బగ్గు గోవిందరావు, కింజరాపు సత్యం పాల్గొన్నారు.

అనుబంధ రంగాలతో అధిక ఆదాయం

వ్యవసాయ అనుబంధ రంగాలతో అధిక ఆదాయం పొందవచ్చని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి తెలిపారు. యలమంచిలి గ్రామ చెరువులో మంగళవారం చేప పిల్లలను విడిచిపెట్టారు. వీటిని పెంచడం ద్వారా ఆర్థికాభివృద్ధి సాధించాలని కోరారు. మత్స్యశాఖ ఏడీ. టి.సంతోష్‌కుమార్, ఎఫ్‌డీఏ సురేష్, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష దీపారాధన

నరసన్నపేట, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): స్థానిక సిద్ధాశ్రమంలో కార్తీక బహుళ ఏకాదశి సందర్భంగా మంగళవారం లక్షదీపారాధన చేపట్టారు. ముందుగా విఘ్నేశ్వర పూజ, మండపారాధన, యాగం చేశారు. మహిళలు ప్రత్యేక పూజలు చేసి దీపారాధన నిర్వహించారు. కార్యక్రమంలో సిద్ధాశ్రమం ట్రస్టు సభ్యులు, అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.


పూజలు చేస్తున్న మహిళలు

104 సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి



కొత్తూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని కురిగాం పీహెచ్‌సీ 104 సిబ్బంది కోరారు. ఈ మేరకు టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట వెంకటరమణను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నెలనెలా సక్రమంగా వేతనాలు రాకపోవడంతో కుటుంబ పోషణ కష్టతరమవుతోందన్నారు. 104 సిబ్బంది దారపు ఫల్గుణరావు, కిరణ్ పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

యూటీఎఫ్ జిల్లా కార్యవర్గం ఎన్నిక

హరిపురం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ జిల్లా కార్యవర్గాన్ని మంగళ వారం ఎన్నుకున్నారు. ఆ వివరాలను సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వరరావు ప్రకటించారు. జిల్లా అధ్యక్షుడిగా లండ బాబూరావు మరో పర్యాయం ఎన్నికయ్యారు. హరిపురం హైస్కూల్ ఆవరణలో యూటీఎఫ్ స్వర్ణోత్సవాల్లో భాగంగా మంగళవారం ఎన్నికల అధికారి ఎస్.మురళీమోహన్ ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వ హించారు. గౌరవాధ్యక్షుడిగా కె.వైకుంఠరావు, ప్రధాన కార్యదర్శిగా బమ్మిడి శ్రీరామ్మూర్తి, కోశాధికారిగా బి.రవికుమార్ ఎన్నికయ్యారు. అలాగే రాష్ట్ర కౌన్సిలర్లుగా చౌదరి రవీంద్ర, పి.అప్పారావు, వె.ఉమా శంకర్, బల్ల చిట్టిబాబు, గుంట కోదండరావు, ప్రకాశరావు, వాగ్దేవి, దమయంతి, ఎల్వీ చలం, కె.మాధవ రావులతో పాటు 14 మందిని కార్యదర్శులుగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేపట్టారు.

వాహనాల ముమ్మర తనిఖీ

పోలాకి, నవంబరు26(ఆంధ్రజ్యోతి): పోలాకి రహదారిలో మంగళవారం పోలీసులు వాహనాలను ముమ్మరంగా తనిఖీ చేపట్టారు. ఎస్ఐ రంజిత్ వాహనాల ధ్రువపత్రాలను పరిశీలించారు. మద్యం తాగి వాహనాలు నడపవద్దని, సీటు బెల్టు పెట్టుకోవాలని, హెల్మెట్ ధరించాలని సూచించారు. రికార్డులు సరిగా లేని వారి వద్ద నుంచి అపరాధరుసుం వసూలు చేశారు.

పనిభారం తగ్గించాలని వినతి

నందిగాం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): పనిభారం తగ్గించాలంటూ గ్రామ పంచాయతీ కార్యదర్శులు కోరారు. ఈ మేరకు మంగళవారం ఎంపీడీవో టి.రాజారావుకు వినతిపత్రం అందించారు. సచివాలయ ఉద్యోగులు చేపట్టాల్సిన కార్యక్రమాలు, సర్వేను తమకు అప్పగించడం సరికా దని, మాతృశాఖలో చేపట్టా ల్సిన కార్యక్రమాల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వివరించారు. కార్యదర్శుల సంఘ ప్రతిని ధులు కె.సంతోష్‌కుమార్, రమణ బాబు, ఇ.లక్ష్మణ రావు, సీహెచ్.ఢిల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మూడు రోజులు వరి కోతలు వద్దు

నరసన్నపేట, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): రానున్న మూడు రోజులు పాటు వర్షాలు పడే అవకాశం ఉందని వరి కోతలు చేయవద్దని ఏవో సునీత తెలిపారు. ఈమేరకు మంగళవారం యారపాడు గ్రామంలో రైతులకు అవగాహన కలిగించారు. నూర్పులు చేసిన ధాన్యాన్ని భద్రపరుచుకోవాలన్నారు. ఈనెల 28 నుండి 30 వరకు వర్షాలు పడే అవకాశం ఉందని రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. వరి కుప్పలపై పరదాలు వేసుకోవాలని సూచించారు. వర్షాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆమెతో పాటు సిబ్బంది, రైతులు ఉన్నారు.

'సూర్యఘర్'పై అవగాహన కల్పించాలి

నరసన్నపేట, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అందించే సూర్యఘర్ పథకంపై మరింత అవగాహన కల్పించాలని జడ్పీ సీఈవో కెవీఎస్ శ్రీధర్ రాజా సూచించారు. మంగళవారం సూర్యఘర్ పథకంలో ఏర్పాటు చేసిన సోలార్ విద్యుత్ ఉత్పాదనను మారుతీనగర్‌లో పరిశీలించారు. సౌరవిద్యుత్ ఉత్పాదక కేంద్రాలను ఏర్పాటు చేసుకున్న వారికి రాయితీతో పాటు బ్యాంకులు తక్కువ వడ్డీకి రుణ సదుపాయం ఇస్తాయన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో మధుసూదనరావు, విద్యుత్‌శాఖ డీఈఈ ఇందిర తదితరులు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి

పలాస, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతాంగ వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని ప్రజా సంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం పట్టణంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.మోహనరావు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ అమ్మనాయుడు, ఇఫ్టూ జిల్లా నాయకుడు వీరాస్వామి, బీకేఎం నాయకుడు చాపర సుందరలాల్, తామాడ సన్యాసిరావు మాట్లాడుతూ.. సంపద సృష్టించేది, తిండి పెట్టేది ఈ వర్గాలే అని అయితే వారికి వ్యతిరేకంగా ప్రభుత్వాలు కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా పనిచేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నేతలు చాపర వేణుగోపాల్, భాస్కర రావు, అమ్మనాయుడు, ఎన్.గణపతి, అజయ్‌కుమార్, మోహనరావు పాల్గొన్నారు.

వైసీపీ నేతల పన్నాగంలో పడొద్దు

హరిపురం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఉద్దానం ప్రాంతంలో నిర్మించనున్న ఎయిర్‌పోర్ట్ విషయంలో వైసీపీ నాయకులు పన్నుతున్న వలలో ఎవరూ చిక్కుకోవద్దని మండల టీడీపీ నాయకులు అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో మంగళవారం కూటమి నేతలు, టీడీపీ మండల అధ్యక్షుడు బావన దుర్యోధన, జిల్లా అధికార ప్రతినిధి దాసరి తాతారావు, జీకే నాయుడు, కుప్పాయి గోపాలరావు తదితరులు మాట్లాడుతూ.. ఎయిర్‌పోర్ట్ వద్దంటూ కొందరు ప్రజా సంఘాల పేరుతో వైసీపీ నాయకులు దుష్ప్రచారం చేస్తున్నారని, ఈ మాటలను ఎవరూ నమ్మవద్దన్నారు. ఎయిర్‌పోర్ట్ వల్ల ఉద్దానం ప్రాంతం లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. అలాగే భూమలిచ్చే రైతులకు మంచి ప్యాకేజీ ఉంటుందన్నారు. కార్యక్రమంలో రట్టి లింగరాజు, బమ్మిడి కర్రయ్య, లబ్బ రుద్రయ్య, తమిరి భాస్కర రావు తదితరులు పాల్గొన్నారు.